



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు

సమస్యలు పట్టించుకోని పాలకవర్గాలను ప్రశ్నిద్దాం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ప్రభాకర్‌రెడ్డి - ఎమ్మిగనూరు నియోజకవర్గ సిపిఎం జీపుజాతా ప్రారంభం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సమస్యలు పట్టించుకోని పాలకవర్గాల విధానాన్ని ప్రశ్నించడంతోపాటు పరిష్కరించే దాకా ప్రజలందరినీ కూడగట్టి ఉద్యమాలు నిర్వహిద్దామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఎమ్మిగనూరు పట్టణంలోని తేరుబజార్ సర్కిల్ వద్ద సిపిఎం జిల్లా నాయకులు సి.గోవిందు అధ్యక్షతన జీపుజాతాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు మాట్లాడారు. కర్నూలు జిల్లా నుంచి రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులుగా అత్యున్నత పదవులు అలంకరించారని తెలిపారు. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా జిల్లాకు చేసింది మాత్రం శూన్యమన్నారు. కర్నూలు జిల్లా రెండుగా విడిపోయిన తర్వాత కరువు ప్రాంతం మాత్రమే కర్నూలు జిల్లాగా మిగిలిపోయిందన్నారు. జిల్లా సంక్షేమం పట్టని పాలకుల విధానాలకు వ్యతిరేకంగా, కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధిని కాంక్షిస్తూ వందలాదిమందితో ఈనెల 26 నుంచి 31 వరకు ఆదోని నుంచి కర్నూలు కలెక్టరేట్ వరకు మహాపాదయాత్ర నిర్వహించి, వేలాది మందితో మహాధర్నాను నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, ఎక్కడికక్కడ వాటి పరిష్కారం కోరుతూ సచివాలయ అధికారులకు వినతులు ఇస్తున్నట్లు చెప్పారు. గ్రామగ్రామాన తిరుగుతూ ప్రజలను చైతన్యం చేస్తూ ప్రశ్నించే వారిగా తీర్చిదిద్దేందుకు జిల్లావ్యాప్తంగా నియోజకవర్గాల స్థాయిలో జీపుజాతాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మిగనూరు నుంచి ప్రారంభించిన ఈ జీపుజాతా ఎమ్మిగనూరు పట్టణం, మంత్రాలయం, నందవరం, గోనెగండ్ల, ఎమ్మిగనూరు మండలాల్లో ప్రజలను చైతన్యం చేస్తూ సాగుతుందని వివరించారు. ఆదోని, ఎమ్మిగనూరు మధ్య టెక్స్‌టైల్స్ పార్కు నిర్మించాలని, ఆర్‌డిఎస్ కుడికాలువను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గురురాఘవేంద్ర ఎత్తిపోతల స్కీంను పూర్తి చేయాలని, మంత్రాలయం, నాగులదిన్నె, సుంకేసుల మీదుగా రోడ్డు పూర్తి చేయాలని కోరారు. బనవాసిలో అగ్రికల్చర్ ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని, ఎమ్మిగనూరులో లెదర్ పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.


జీపుజాతాను ప్రారంభిస్తున్న ప్రభాకర్ రెడ్డి

ఎమ్మిగనూరులో రింగ్ రోడ్డు ఏర్పాటు చేయాలని, నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికీ రోడ్లు నిర్మించాలని కోరారు. పట్టణంలో, శివారు కాలనీల్లో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకష్ణ, కెవి.నారాయణ, జిల్లా నాయకులు ఎమ్‌డి.ఆనంద్ బాబు, ఎమ్‌డి.అంజిబాబు, గురుశేఖర్, ఎమ్మిగనూరు మండల కార్యదర్శి హనుమంతు, నాయకులు రాముడు, లక్ష్మీ నరసయ్య, సురేష్, నరసింహులు, బి.రాజు, కరుణాకర్, అబ్దుల్, ఆంథోని, రాజు, రమేష్, కాలప్ప, కృష్ణ పాల్గొన్నారు.

సమస్యలను పరిశీలించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి -కోడుమూరు

కోడుమూరు సిపిఎం నాయకులు శనివారం నాడు గోరంట్ల , అనుగొండ గ్రామాలలో సిపిఎం ఆధ్వర్యంలో సమస్యలను పరిశీలించారు. నాయకులు గపూర్‌మియా, వీరన్న మాట్లాడుతూ గోరంట్ల గ్రామంలోని హంద్రీ నదిలో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తిచేయాలన్నారు. హంద్రీ నది నుండి నీరు గ్రామంలోకి రాకుండా సేఫ్టీ వాలు ప్రహరీ గోడలు నిర్మించాలన్నారు. తాగునీటి కొరకు అదనంగా మరొక ట్యాంకు నిర్మాణాన్ని చేపట్టాలని, బిసి కాలనీలో సిసి రోడ్లు వేయాలని ,ముడమలకుర్తి, గోరంట్ల గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని అన్నారు. మజారా గ్రామం కొత్తపల్లిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సిసి రోడ్లు వేయాలని, బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జిపి వీరన్న, మధుబాబుతో కలసి గోరంట్ల గ్రామం సచివాలయ సెక్రెటరీ వారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల గ్రామంలో రంగన్న గిడ్డయ్య అనుగొండ గ్రామంలో వెంకట్ రాముడు, మాదులు రమేష్, శివయ్య చంద్రమోహన్ పాల్గొన్నారు.

పెరిగిన విద్యుత్ చార్జీలను రద్దుచేయాలి

- పట్టణ పౌర సంక్షేమ సంఘం డిమాండ్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పెరిగిన కరెంటు చార్జీలను వెంటనే రద్దు చేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఇ.పుల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఎ. వెంకటేశ్వర్లు అధ్యక్షత జరిగిన ధర్నాను ఉద్దేశించి సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, సీనియర్ న్యాయవాది వి.రహంతుల్లా, ఎం.నాగరాజు, ఎస్.నౌషాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రకరకాల పేర్లతో కరెంటు చార్జీలు పెంచడం వల్ల రాష్ట్రంలో ఉండాలా వదిలి పోవాల? అని ప్రజలు ప్రశ్నించే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. ఒకపక్క ఇంటి పన్నులు మరోపక్క కరెంటు చార్జీలు పెంచడం వల్ల మూలిగే నక్కపై తాటి కాయ పడ్డ చందంగా ప్రజల పరిస్థితి తయారయిందన్నారు. పెరిగిన కరెంటు చార్జీలు రద్దుచేసి మధ్యతరగతి వ్యాపార సంస్థలను, చిన్న పరిశ్రమలను మూతపడకుండా కాపాడాలని కోరారు. ధర్నా కార్యక్రమానికి నగర నాయకులు ఎల్ నయూం, ఎం.సాంబశివారెడ్డి, సివి రమణ, ఎస్.రమణ గౌడ్, ఎన్ మద్దిలేటి, కె. శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలందించాలి

- వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలి

- డిఎంహెచ్‌ఒ డాక్టర్ రామగిడ్డయ్య

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న వైద్య అంశాలు దృష్టిలో పెట్టుకుని క్షేత్రస్థాయిలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.రామదుడ్డయ్య వైద్యులకు సూచించారు. శనివారం కర్నూలు వైఎస్‌ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యులకు 2 రోజుల శిక్షణా కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య , ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రామగిడ్డయ్య మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సమయ పాలన పాటించాలని సిబ్బంది కూడా పాటించేలా చూడాలని ఆదేశించారు. ఆరోగ్య శాఖ పరిధిలో అమలు అవుతున్న వైద్య సేవలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వం అమలు పరుస్తున్న అన్ని ఆరోగ్య పథకాలపై పూర్తి సేవలు క్షేత్ర స్థాయిలో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని తెలిపారు. ముఖ్యంగా గర్భస్థ ఆరోగ్య సేవలు, మాతాశిశు సంరక్షణ సేవలపై తగిన వైద్యం అందేలా చూడాలన్నారు. చాలా ఉపయోగకరమైన అంశాలపై పూర్తి స్థాయి శిక్షణ అందించారని వీటిని సద్వినియోగ పరచుకొని ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందియ్యాలని తెలిపారు. అనంతరం శిక్షణ పొందిన వైద్యులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సర్టిఫికెట్ లను ప్రదానం చేసారు. డిపిఎంఒ డాక్టర్ ఉమా, డిపిఒ విజయరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ డాక్టర్ రామగిడ్డయ్య

కదంతొక్కిన అంగన్వాడీలు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీలు కదం తొక్కారు. కర్నూలు ధర్నా చౌక్, నంద్యాల కలెక్టరేట్ వద్ద 36 గంటల మహా ధర్నాలు చేపట్టారు. రాత్రి పూట కూడా అక్కడే జాగారం చేశారు. నిర్విరామంగా ఆందోళన సాగించారు. రెండో రోజు కర్నూలులో కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. నంద్యాలలో నూనె పల్లె ఫ్లై ఓవర్ వరకు ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేపట్టారు. ఐసిడిఎస్ బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. ఐసిడిఎస్ ను నిర్వీర్యం చేయాలని మోడీ ప్రభుత్వం చూస్తోందన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మహాపాదయాత్రకు సన్నద్ధం...

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఈనెల 26 నుంచి 31 వరకు కర్నూలు జిల్లావ్యాప్తంగా నిర్వహించే మహాపాదయాత్ర కోసం సిపిఎం ఆధ్వర్యంలో విస్తతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రధానంగా కర్నూలు నగరంలో ఇంటింటికి తిరిగి సిపిఎం బందాలు సమస్యలను సేకరిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గ, మండలకేంద్రాల్లో సమావేశాలు, సభలు నిర్వహించి మహాపాదయాత్ర ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. జిల్లా సమగ్రాభివద్ధి కోసం రూ.10 వేల కోట్లు కేటాయించాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరింది. జిల్లా కేంద్రం నుంచి రాజధాని అమరావతికి రోడ్డు, రైలు మార్గాలు వేసి, కర్నూలు నుంచి అమరావతికి రెగ్యులర్ రైలు నడపాలన్నారు. రైల్వే వ్యాగన్ వర్క్ షాపు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆదోని, ఎమ్మిగనూరులలో టెక్స్టైల్ పార్కులను నిర్మించాలన్నారు. సమస్యల పరిష్కారానికి సిపిఎం దశలవారీ ఆందోళనల్లో భాగంగా ఈనెల 10 వరకు గ్రామాల్లో, వార్డుల్లో పర్యటించి స్థానిక సమస్యలను గుర్తించి సచివాలయాల్లో వినతి పత్రాలు ఇస్తామన్నారు. రెండో దశలో 11, 12, 13న కరపత్రాలు వేసి అన్ని నియోజకవర్గాలలో ఆరుజీపు జాతాల ద్వారా ప్రచారం చేపట్టారు.



పురోగతి లేనిచోట దృష్టి సారించండి

- జిల్లా అధికారులతో కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

సచివాలయ పరిధిలో హౌసింగ్ నిర్మాణంలో పూర్తిస్థాయి పురోగతి లేని ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షలు నిర్వహించి ఏ ఒక్క సచివాలయ పరిధిలో పనులు పూర్తిగా చేయని వారిపై చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్లను, ఎంపిడిఒలను జిల్లాకలెక్టర్ ఆదేశించారు. శనివారం స్పెషల్ ఆఫీసర్లు, ఎంపిడిఒలు, హౌసింగ్ ఇంజనీర్లతో హౌసింగ్, ఉపాధి హామీ పథకం అమలు, జగనన్న సురక్ష, విద్యాశాఖ అంశాల పై జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 3 నుండి 13వ తేదీ వరకు 121 సచివాలయాల్లో జీరో పురోగతి సాధించారని సంబంధిత సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షలు నిర్వహించి ఏ ఒక్క సచివాలయంలో పనులు చేయని వారిపై చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్లను, ఎంపిడిఒలను కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా కష్ణగిరి మండలంలో 3 సచివాలయాలు, ఆదోని మండలంలో 12 సచివాలయాలు, నందవరంలో 7 సచివాలయాలు, హాలహర్వి మండలంలో 7 సచివాలయాలు, కర్నూలులో 9 సచివాలయాలు ఆస్పరి మండలంలో కొన్ని సచివాలయాలు జీరో పురోగతి నమోదు చేశారని గత సమావేశంలో సచివాలయాల వారీగా జీరో పురోగతి సాధించిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షలు నిర్వహించుకొని జీరో పురోగతి ఉండకుండా చర్యలు తీసుకోవాలని చెప్పినప్పటికీ కూడా సమీక్షలు నిర్వహించడం లేదని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధించిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించి పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న సురక్షకు సంబంధించి సర్వీసెస్ జనరేట్ చేయడంలో కౌతాళం, క్రిష్ణగిరి మండలాలు చాలా వెనుకబడి ఉన్నారని సర్వీసెస్ జనరేట్ చేయడంలో పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఆదేశించారు. ముఖ్యంగా కౌతాళం మండలంలో వాలంటీర్ హౌస్‌హోల్డ్ సర్వేలో కూడా తక్కువ శాతం ఉన్నారని, 33 శాతం మంది వాలంటీర్లు అసలు సర్వేనే మొదలు పెట్టలేదని వివిధ కారణాలు చెప్పి పనులలో ఆలస్యం చేయొద్దని సంబంధిత సర్వేని కూడా త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కౌతాళం ఎంపిడిఒను కలెక్టర్ ఆదేశించారు. సర్వ శిక్ష అభియాన్ కి సంబంధించి వాలంటీర్ల ద్వారా 5 నుండి 18 ఏళ్ల విద్యార్థుల సర్వేలో 91 శాతం పూర్తి చేశారని త్వరితగతిన 100 శాతం పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సిస్టం డ్రాప్ ఔట్ పిల్లల సంఖ్యను ఎందుకు తగ్గించలేకపోతున్నారని ఆదోని, ఎమ్మిగనూరు మండలాల విద్యాశాఖ అధికారులను ఆరా తీశారు. ఎమ్మిగనూరు మండల విద్యాశాఖ అధికారి స్పందిస్తూ ప్రైవేట్ పాఠశాలలు కో-ఆపరేట్ చేయడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా అటువంటి ప్రైవేట్ పాఠశాలలు ఎవరైనా కోఆపరేట్ చేయకుంటే వారికి నోటీసులు ఇవ్వాలని సర్వ శిక్ష అభియాన్ పిఒని కలెక్టర్ ఆదేశించారు. ఆదివారం నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత మండల విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. హౌసింగ్ పీడీ వెంకట నారాయణ, డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, సర్వ శిక్ష అభియాన్ పిఒ వేణుగోపాల్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన

కరుణించిన మేఘం

కర్నూలులోతట్టు ప్రాంతాల జలమయం

విత్తనానికి సిద్ధమంటున్న రైతులు

ప్రజాశక్తి- కర్నూలు అగ్రికల్చర్



మేఘం కరుణించింది. ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల ఒక మోస్తారు వర్షం కురిసింది. రైతుల్లో సాగుపై ఆశలు చిగురించాయి. జిల్లాలో విత్తన సాగు కనీసం 20 శాతం కూడా పూర్తి కాలేదు. బావులకింద బోర్ల కింద అక్కడక్కడ సాగు జరిగింది. వర్షాధార పంటలు కొన్ని చోట్ల సాగు జరిగినా వర్షాభావ పరిస్థితుల వల్ల మొలకెత్తిన పంట కూడా వాడుముకం పట్టాయి. కర్నూలు అర్బన్, కర్నూలు రూరల్, కల్లూరు, ఓర్వకల్, తదితర మండలలతో పాటు కొన్ని చోట్ల మోస్తరు వర్షపాతం నమోదయింది. కర్నూలు నగరంలో మధ్యాహ్నం నుండి భారీ వర్షం కురిసింది. నగరంలోని చాలా లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కాలువలు పొంగిపొర్లాయి. కొన్ని మండలాల్లో వర్షం కురవడంతో రైతులు విత్తనానికి సిద్ధమయ్యారు. జూన్ నుండి సరైన వర్షపాతం లేనందున విత్తనానికి పదును లేకపోవడం వల్ల విత్తనసాగు జరగలేదు. శనివారం వర్షపాతం నమోదవడం వల్ల విత్తనానికి రైతులు సన్నద్ధం అవుతున్నారు. ఇప్పటికే వర్షం కురవకపోవడం వల్ల పంటలు ఆలస్యం అయ్యాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. నేటి నుండి అయినా వర్షం కురిస్తే విత్తనానికి సానుకూలంగా ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు. సరైన సమయంలో విత్తనం సాగు కాకుంటే దిగుబడులు కూడా అంతంత మాత్రం వస్తాయని రాష్ట్రంలో ఆత్యల్ప వర్షపాతం నమోదయిన జిల్లాలో కర్నూలు జిల్లా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధికి నోచని కోడుమూరు

సంఘటిత పోరాటాలు అవసరం

ప్రజాశక్తి రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-గూడూరు

కోడుమూరు నియోజకవర్గం సమగ్రాభివద్ధిపై అధికారులు, ప్రజాప్రతినిధులు అడుగడుగునా నిర్లక్ష్యం చేస్తున్నారని రాజకీయ, ప్రజంఘాల నాయకులు పేర్కొన్నారు. శనివారం కోడుమూరు ప్రజాశక్తి సీనియర్ పాత్రికేయులు ఇంతియాజ్ బాషా అధ్యక్షతన కోడుమూరు నియోజకవర్గం సమగ్రాభివృద్ధిపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. కోడుమూరుకు కోట్ల విజయభాస్కర్ రెడ్డి, దామోదరం సంజీవయ్య ఎమ్మెల్యేలుగా గెలిచి ముఖ్యమంత్రులుగా రాణించి ఘనత చాటుకున్నారే తప్ప చేసిందేమి లేదని అన్నారు. ఎస్‌సి నియోజకవర్గంగా ఏర్పడి 25 ఏళ్ళు కాగా ఎస్‌సి ఎమ్మెల్యేలు కూడా అభివద్ధిని కాంక్షించిన దాఖలాలు లేవన్నారు. ఎల్‌ఎల్‌సి కాలువ పురోగతి లేదని, కోడుమూరు. తాగునిటీ పాట్లు, మార్కెట్ యార్డ్ కొరతవంటివి నిదర్శనమని పేర్కొన్నారు. సంఘటిత పోరాటాలతోనే అభివృద్ధి సాధ్యమని వక్తలు సూచించారు. ఎంఆర్‌పిఎస్ కోడుమూరు నాయకులు రాజు మాట్లాడుతూ గ్రూపు రాజకీయాలు సామాన్య ప్రజలను శాసిస్తున్నాయని అన్నారు. కోడుమూరు అభివృద్ధి కమిటీ మెంబర్స్ జయరాం, రాముడు మాట్లాడుతూ ఎన్నికల్లో ఒక్కరోజు ఇచ్చే నోటుకు విలువైన ఓటును తాకట్టు పెట్టి నాయకులను కోటీశ్వర్లుగా చేస్తూ కష్టాలను కొని తెచ్చుకొంటున్నామని అన్నారు. సిపిఎం జిల్లా నాయకులు గఫూరుమియ్యా మాట్లాడుతూ కోడుమూరు, గూడూరు, సి బెళగల్ మండలాలు అభివృద్ధి చెందాలంటే గుంద్రెవుల శరణ్యమని, ప్రతి మండలంలో డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు మోహన్ మాట్లాడుతూ బెళగల్ చెరువును, కళ్ళపరి కుంటను, పలుకు దొడ్డి చెరువును, గుంద్రేవుల డ్యామ్‌కు అనుసంధానం చేయాలన్నారు. బెళగల్ మండలంలో 15 ఏళ్లుగా రోడ్ల అభివృద్ధిని మరిచారని గుర్తుచేశారు. గూడూరు మాజీ జడ్‌పిటిసి ఎల్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నగర పంచాయితీగా స్థాయిని పెంచారని, అభివద్ధికి నిధులు మంజూరు చేయుటలో అలసత్వం వీడటం లేదన్నారు. గూడూరు రింగ్‌రోడ్డు అభివృద్ధి ప్రస్తావన లేదన్నారు. ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు ఆంధ్రయ్య మాట్లాడుతూ కోడుమూరు ఎమ్మెల్యేలుగా వారి స్థాయిని పెంచుకొనేందుకు కోట్లలో నిధులు ఖర్చులు చేస్తున్నారని అన్నారు. ప్రజాప్రయోజనం సూన్యమని అన్నారు. గూడూరు కౌన్సిలర్లు దస్తగిరి, విజయుడు, ప్రజాశక్తి సర్క్యులేషన్ జిల్లా ఇన్‌ఛార్జి ఎస్ఎడి బాష, ఎమ్మిగనూరు డివిజన్ ఇన్‌ఛార్జి ఎం.రంగయ్య, గూడూరు విలేకరి ప్రభాకర్‌నాయుడు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు రాజు


విల్లును ఎక్కుపెట్టిన డాక్టర్ శంకర్‌శర్మ

విలువిద్య సాధనతో ఏకాగ్రత

ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర శర్మ

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

మన దేశ సంప్రదాయ క్రీడ అయినా విలువిద్యలో సాధన చేయడం వల్ల విద్యార్థులు మానసిక శారీరక ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు ఏకాగ్రత పెరిగి చదువులోనూ రాణిస్తారని ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. కర్నూల్ నగరంలోని శంకరాశ్ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన జిల్లాస్థాయి విలువిద్య ఎంపిక పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలు విలువిద్యలో సాధన చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. క్రీడలతోపాటు అన్ని రంగాలలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మహిళలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సూచించారు. మహిళా సాధికారతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వివరించారు. సమాజంలో మహిళలు వివక్షతకు గురవుతున్నారని,ఆ పరిస్థితిని తప్పించాలంటే మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని చెప్పారు. ప్రస్తుతం పురుష క్రికెటర్లకు సమానంగా మహిళా క్రికెటర్లకు వేతనాలు ఇచ్చేందుకు నిర్ణయించడం అభినందనీయమని చెప్పారు. విలువిద్య మనదేశంలో వేల సంవత్సరాలు క్రితమే ప్రాచుర్యం పొందిందని చెప్పారు. ఈ విలువిద్యలో సాధన చేయడం వల్ల మానసిక శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని, దీనికి తోడు ఏకాగ్రత పెరుగుతుందని చెప్పారు. దీనివల్ల చదువులో రాణించే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే జీవితంలో స్థిరపడే అవకాశం ఉందని చెప్పారు.


వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్‌పి జి.కృష్ణకాంత్

వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్‌పి

ప్రజాశక్తి-వెల్దుర్తి

వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్‌పి జి.కృష్ణ కాంత్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డితో శాంతిభద్రతలు, వెల్దుర్తి పట్టణంలోని ట్రాఫిక్ సమస్యలపై చర్చించారు. సిబ్బందితో మాట్లాడారు. అనంతరం చెరుకులపాడు గ్రామానికి వెళ్లి అక్కడ నిర్వహిస్తున్న పోలీస్ పికెటింగ్‌ను పరిశీలించారు. క్రిష్ణగిరికి వెళ్లారు.

భార్యను కడతేర్చిన కసాయి

అర్ధరాత్రి ఇంట్లో గొడ్డలితో నరికి పరార్

ప్రజాశక్తి తుగ్గలి

కట్టుకున్న భర్తే కాలయముడై అతికిరాతకంగా హత్య చేసిన సంఘటన కర్నూలు జిల్లా తుగ్గలి మండలం రాంపురం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రామాంజనేయులు వివరాలు ప్రకారం....అనంతపురం జిల్లా గుంతకల్ మండలం ములకలపెంటకు చెందిన పద్మావతికి(35) రాంపురం వెంకటేష్‌తో వివాహమయ్యింది. కూతురువివాహనికి సంబంధించి భార్యాభర్తలిద్దరి మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. నేను చెప్పిన వానికే కూతురును ఇవ్వాలని భర్త, లేదు నేను చెప్పిన వారికే ఇవ్వాలని ఒకరికి ఒకరు పట్టుపట్టడంతో ఇద్దరి మధ్య గొడవ పెద్దదయింది. దీంతో భార్య మీద కక్ష పెంచుకున్న భర్త వెంకటేష్ శనివారం అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో భార్య పద్మావతిపై గొడ్డలితో తలపై కొట్టడంతో రక్తపు మడుగుల మధ్య కొట్టుమిట్టాడుతూ మృతి చెందింది. భర్త వెంకటేష్ అక్కడి నుండి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు జొన్నగిరి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని హత్య స్థలాన్ని పరిశీలించారు. పద్మావతి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటేష్‌తో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పద్మావతి దంపతులకు ఒక కుమారుడు ఒక కుమార్తె ఉన్నారు.

ఐటిఐలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

2023-24 విద్యా సంవత్సరమునకు గాను జిల్లాలోని ప్రభుత్వ , ప్రైవేటు ఐటిఐలలో రెండో విడత ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందనిరాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ దామోదర చౌదరి, జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆదినారాయణ సంయుక్తంగా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థిని విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా web site iti.ap.gov.in లో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. 10 వ తరగతి పాసైన అభ్యర్థులు లేదా ఇంటర్, డిగ్రీ పాసైన లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకొనుటకు ఆఖరు తేది ఈనెల 31 వరకు గడువు ఇచ్చినట్లు పేర్కొన్నారు. మహిళా అభ్యర్థులకు ప్రతి ట్రేడ్‌లో 33 శాతం రిజర్వేషన్ ఉందన్నారు. పూర్తి వివరాలకు తమ సమీప ప్రభుత్వ , ప్రైవేటు ఐటిఐ లను సంప్రదించాలన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

17న నస్పందన

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

ఈనెల 17న సోమ వారం కర్నూలు కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 'స్పందన' కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు.

విద్యార్థుల బయోమెట్రిక్ 100శాతం చేయాలి

ప్రజాశక్తి-సి బెళగల్

ప్రతి పాఠశాలలో విద్యార్థుల బయోమెట్రిక్ ను 100 శాతం త్వరితగతిన పూర్తి చేయాలని విద్యాధికారి -2 ఆడమ్ బాషా, ఎంపిడిఒ రాముడు కోరారు. శనివారం మోడల్ స్కూలుతో కంభదహాల్, గొల్లల దొడ్డిలో పాఠశాలలను తనిఖీ చేశారు. ఇక్కడే ప్రిన్సిపల్ వంశీమోహన్ సమక్షంలో విద్యార్థుల హాజరును, ఉపాధ్యాయులు పనితీరును, బోధనను, మెనూను పరిశీలించారు. వేళలు పాటించి విద్యార్థులను తీర్చిదిద్దాలని పేర్కొన్నారు.


వంటలను పరిశీలిస్తున్న అధికారులు


జీపుజాతానుద్దేశించి మాట్లాడుతున్న అంజిబాబు

రైతు బాధలు పట్టించుకోని ప్రభుత్వాలకు బుద్ధి చెబుదాం

- సిపిఎం జిల్లా నాయకులు అంజిబాబు

ప్రజాశక్తి - మంత్రాలయం

రైతు బాధలను పట్టించుకోలేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెబుదామని, కలిసి రావాలని సిపిఎం జిల్లా నాయకులు ఎమ్‌డి.అంజిబాబు, ఎమ్‌డి.ఆనంద్ బాబు, గురుశేఖర్ కోరారు. శనివారం సిపిఎం మండల కార్యదర్శి హెచ్.జయరాజు ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతాలో వారు మాట్లాడారు. గ్రామాల్లో రైతులకు అవసరమైన నడిచే రస్తాలను పట్టించుకోవడంలో, రైతు బాధలను విస్మరించిన పాలకులకు గుణపాఠం చెప్పేలా ఉద్యమిద్దామని కోరారు. మండల అభివృద్ధిని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో జీపుజాతా చేపట్టామని తెలిపారు. మండలంలోని చిలుకలడోన, కల్లుదేవకుంట, మంత్రాలయం, మాధవరం, చెట్నహళ్లి, సూగూరు, బూదూరు, వగరూరు, మాలపల్లి, చౌళహళ్లి, సుంకేశ్వరి, రచ్చుమర్రి గ్రామాల్లోని కూడళ్లలో సభలు నిర్వహిస్తూ, ప్రజలను చైతన్యం చేస్తూ ప్రభుత్వాల అలసత్వాలను వివరించారు. రహదారులన్నీ గుంతలమయంగా ఉన్నాయని పేర్కొన్నారు. తుంగభద్ర నది దగ్గర ఫిల్టర్ బెడ్ ఏర్పాటు చేసి మండల ప్రజలకు తాగునీటిని అందించాలని కోరారు. రాజకీయమంటే డబ్బు సంపాదించడం, మీసాలు దువ్వడం కాదని, ఏ ప్రాంత ప్రజలైతే నమ్మకంతో ఓటేస్తారో వారి బతుకుల బాగు కోసం కూడా పనిచేయడమని తెలిపారు. సిపిఎం నాయకులు బి.కరుణాకర్, ఆంధ్రయ్య, నరసయ్య, పెద్దయ్య పాల్గొన్నారు.


లబ్ధి పత్రాలను అందిస్తున్న జగన్మోహన్ రెడ్డి

ప్రతి గడపలో నవరత్నాల వెలుగులు


- వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రతి గడపలోనూ నవరత్నాల వెలుగులు నిండుతున్నాయని వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని టిఎస్.కుల్లూరు గ్రామంలో రెండోరోజూ 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ప్రయివేట్‌కు ధీటుగా తీర్చిదిద్దారని తెలిపారు. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి గ్రామంలోనే విత్తనాలు, ఎరువులు, రసాయన మందులు, వ్యవసాయ సామగ్రి అందిస్తున్నారని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

చాతుర్మాస దీక్షలో శ్రీమఠం పీఠాధిపతులు

ప్రజాశక్తి - మంత్రాలయం


పూజలు నిర్వహిస్తున్న పీఠాధిపతులు

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు చాతుర్మాస దీక్ష చేపట్టారు. శనివారం స్థానిక శ్రీమఠంలో రాఘవేంద్రుని ఆరాధ్య దైవమైన మూల రాములుకు, రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మంగళ హారతులు ఇచ్చారు. పండితుల వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ సాంప్రదాయ పద్ధతిలో దీక్షకు పూనుకున్నారు. ఈనెల 15 నుంచి సెప్టెంబరు 19 వరకు సుమారు 75 రోజులు దీక్షలో ఉంటారని శ్రీమఠం ఎఎఒ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్.కె.శ్రీనివాసరావు, వెంకటేష జ్యోషి తెలిపారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీన్యాయసుధ గ్రంథం, భాగవత పారాయణం, భజన మండలి సభ్యుల భక్తి గీతాలు, గ్రంథాలపై పండితుల మధ్య ఇష్టాగోష్టి, భక్తులకు ముద్రాదరణతో ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదిస్తారు. శిష్య బృందానికి, భక్తులకు పాదపూజల నిర్వహణకు అవకాశం ఇస్తారు. అత్యవసరమైతే తప్ప గ్రామ పొలిమేర దాటి వెళ్లరు. ఒక వేళ వెళ్లాల్సి వస్తే సూర్యాస్తమయంలోపు శ్రీమఠం చేరుకునే ఆచారం కొనసాగుతుందని పండితులు చెబుతున్నారు. ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహమూర్తి, సహాయక పిఆర్ఒ హొన్నాళ్లి వ్యాసరాజాచార్ పాల్గొన్నారు.

మహా పాదయాత్రను జయప్రదం చేయండి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ప్రభాకర్ రెడ్డి

- పాదయాత్రకు పెరిగిన మద్దతు - రౌండ్‌టేబుల్ సమావేశం సక్సెస్

ప్రజాశక్తి - ఆదోని

మహాపాదయాత్రను జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి కోరారు. ఈనెల 26 నుంచి 31 వరకు జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఆదోని నుంచి కర్నూలు వరకు చేపట్టే మహా పాదయాత్రకు మద్దతు ఇచ్చే వారి సంఖ్య పెరిగింది. సంఘీభావం తెలుపుతున్నట్లు పార్టీలు, ప్రజాసంఘాలు పేర్కొన్నాయి.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ప్రభాకర్ రెడ్డి


రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరైన నాయకులు

శనివారం పట్టణంలోని ఎన్‌జిఒస్ హోమ్‌లో పట్టణ కార్యదర్శి లక్ష్మన్న అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు మాట్లాడారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులుగా ఇలా ఎన్నో ఉన్నత పదవులు అలంకరించినా జిల్లాకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. జిల్లాలో సాగునీరు, పారిశ్రామిక రంగం, విద్యలో, వెనుకబాటుకు గురైందన్నారు. సహజ వనరులు ఎన్ని ఉన్నా, పాలకుల నిర్లక్ష్యం వల్ల అభివృద్ధిలో అట్టడుగున ఉందని తెలిపారు. పాలకుల నిర్లక్ష్యం, ఆదోని ప్రాంతం నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులకు అభివృద్ధి చేయాలనే తపన లేకపోవడం వల్ల అభివృద్ధి జరగడం లేదని మండిపడ్డారు. కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్రకు సంఘీభావంగా ఉంటామని తెలిపారు. ఆర్‌సిసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు, కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ దేవిశెట్టి ప్రకాష్, నీలకంఠప్ప, సిపిఐ ఎంఎల్ (న్యూ డెమోక్రసీ) జిల్లా నాయకులు మల్లికార్జున, ఆర్యవైశ్య మాజీ అధ్యక్షులు ఎన్ఆర్ఐ నాగేష్ కాకుబల్, ఆమ్ ఆద్మీ పార్టీ ఇన్‌ఛార్జీ నాగరాజు, టిడిపి నాయకులు మల్లికార్జున, బీఎస్పీ నాయకులు రామలింగ, హోమియోపతి వైద్యులు సోమశేఖర్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు షాబిర్ బాష, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి నాగరాజు, పిడిఎస్ఒ నాయకులు తిరుమలేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, బిడిఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు రమేష్, పిడిఎస్‌యు డివిజన్ కార్యదర్శి అఖండ, డిఎస్ఎఫ్ కార్యదర్శి ఉదయ్, జై భీమ్ యూత్ నాయకులు కుమార్, పిఒడబ్ల్యు మహిళా నాయకులు మణెమ్మ, లలిత కళా సమితి నాయకులు శంకర్ రావు, సిపిఐ పట్టణ, మండల కార్యదర్శులు సుదర్శన్, రాజు, సిపిఎం జిల్లా నాయకులు రాధాకృష్ణ, వెంకటేశులు, మండల కార్యదర్శి లింగన్న, సిఐటియు పట్టణ, మండల నాయకులు తిప్పన్న, వీరారెడ్డి, వ్యకాస నాయకులు రామాంజినేయులు, కెవిపిఎస్ నాయకులు నాగేంద్ర పాల్గొన్నారు.

16న జిల్లా సమగ్రాభివృద్ధిపై రౌండ్‌టేబుల్ సమావేశం

- సిపిఎం జిల్లా నాయకులు గోవిందు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఈనెల 16న జిల్లా సమగ్రాభివృద్ధిపై సిపిఎం ఆధ్వర్యంలో ఎన్‌జిఒ హోమ్‌లో (తహశీల్దార్ కార్యాలయం పక్కన) రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా నాయకులు సి.గోవిందు, సి.హనుమంతు కోరారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. రౌండ్‌టేబుల్ సమావేశానికి మేధావులు, జిల్లా అభివృద్ధి కోరుకునే ప్రతిఒక్కరూ రావాలని కోరారు. ఈనెల 26 నుంచి 31 వరకు సిపిఎం ఆధ్వర్యంలో ఆదోని నుంచి కర్నూలు కలెక్టరేట్ వరకు నిర్వహించే మహాపాదయాత్రను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో జిల్లాలో సమస్యల పరిష్కారానికి అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్రలకు ప్రజలు, మేధావులు, రైతులు, కార్మికులు, ఉద్యోగులు, వివిధ ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల నేతలు, అన్ని వర్గాల ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. పట్టణ నాయకులు రాముడు, లక్ష్మీనరసయ్య, అబ్దుల్లా, సురేష్, ఆంథోని, నరసింహులు, బి.రాజు, తిమ్మన్న పాల్గొన్నారు.



మిషన్ రాయలసీమ కరపత్రాలు విడుదల

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని టిడిపి కార్యాలయంలో రాయలసీమ డిక్లరేషన్ పేరుతో మిషన్ రాయలసీమ కరపత్రాలను ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు చేతులమీదుగా శనివారం యువత ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు మాట్లాడారు. యువనేత నారా లోకేష్ 'యువగళం' పాదయాత్ర రాయలసీమ పర్యటనలో భాగంగా వెనుకబడిన రాయలసీమకు 2024 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే చేసే అభివృద్ధి, హామీలను ప్రజల్లో తీసుకెళ్లి చైతన్య పరచడమే ప్రధాన లక్ష్యమన్నారు. టిడిపి కర్నూలు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, యువ నాయకులు మారుతి నాయుడు, సిద్ధార్థ్ నాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు, తెలుగు యువత మండల అధ్యక్షులు వీరేంద్ర, తెలుగు యువత ప్రతాప్, టిఎన్ఎస్ఎఫ్ తేజ, సూర్య, బుద్ధారెడ్డి, అయ్యన్న, నెట్టేకల్, నాగరాజు, సోము పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేపై శిక్షణ

ప్రజాశక్తి - హొళగుంద

ఈనెల 21 నుంచి ఆగస్టు 21 వరకు నిర్వహించే ఇంటింటి సర్వేకు సంబంధించి బిఎల్ఒలకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ అండ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున మాట్లాడారు. వారు స్పెషల్ సమ్మరి రివిజన్-2024కు సంబంధించి పాటించే నియమ, నిబంధనలను వివరించారు. తహశీల్దార్ హుస్సేన్ సాహెబ్, మండల సర్వేయర్ శ్రీనివాసులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దినోజ్ పాల్గొన్నారు.

'ఉపాధి' కల్పనలో నిర్లక్ష్యం వద్దు...

- సామాజిక తనిఖీలో రూ.19,500 అక్రమాలు

- రూ.11,500 రికవరీ

- డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలో ఉపాధి పనులు కల్పించడంలో, ఉపాధి హామీ చట్టం కింద రైతులకు అవగాహన కల్పిస్తున్న పండ్ల తోటల పెంపకంపై నిర్లక్ష్యం చేయవద్దని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. శనివారం దేవనకొండ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ చట్టం సామాజిక తనిఖీ బహిరంగ చర్చ వేదిక ఎంపిడిఒ గౌరీ దేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి 1226 పనులకు రూ.9,57,65,633 ఖర్చు చేసినట్లు తెలిపారు. సామాజిక తనిఖీ స్టేట్ రిసోర్స్ పర్సన్ తిరుమలేష్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ సిబ్బంది 26 పంచాయతీలో జరిగిన ఉపాధి పనులపై గ్రామసభలు ఏర్పాటు చేసి తనిఖీ నిర్వహించినట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో గుండ్లకొండ, ఐరన్‌బండ, జిల్లేడుబుడకల, కరివేముల, పల్లెదొడ్డి, వెలమకూరు, పొట్లపాడు, పి.కోటకొండ, తెర్నేకల్లు గ్రామాల్లో రూ.19,500 అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీ సిబ్బంది వివరించారు. ఈ మేరకు రూ.11,500 రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. రైతులకు ఉపయోగపడే పనులను ప్రణాళికలో గుర్తించి ఆ పనులను చేపట్టి కూలీలు వలసలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. అడిషనల్ పీడీ సిద్ధ లింగమూర్తి, సలీం బాష, ఎఫ్ఎం ఆదయ్య, ఏపీడీ పద్మావతి పాల్గొన్నారు.



బహిరంగ చర్చ వేదికలో మాట్లాడుతున్న పీడీ

పండ్ల మొక్కలు పంపిణీ : ఉపాధి హామీ చట్టం కింద రాయితీపై అందిస్తున్న పండ్ల మొక్కలను రైతులకు అడిషనల్ పీడీ సిద్ధ లింగమూర్తి, ఏపీడీ పద్మావతి, ఏపీవో కృష్ణమూర్తి పంపిణీ చేశారు. మొత్తం 2300 టెంకాయ, 4000 మామిడి మొక్కలు అందించారు. ఈసీ రంగస్వామి, ఉపాధి హామీ చట్టం సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయం చేయలేకపోతే తప్పుకోండి

- వాలంటీర్లను హెచ్చరించిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - చిప్పగిరి

వాలంటీర్ల పరిధిలోని 50 ఇళ్ల ప్రజలకు న్యాయం చేయలేకపోతే తప్పుకోవాలని ప్రజాప్రతినిధులు వాలంటీర్లను హెచ్చరించారు. శనివారం చిప్పగిరి సచివాలయ కార్యాలయంలో సర్పంచి గోవిందరాజులు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి బాలన్న ఆధ్వర్యంలో 'జగనన్న సురక్ష' నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులతో పాటు తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ సివి.కొండయ్య గ్రామ వాలంటీర్ల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, వైసిపి కన్వీనర్ ఏరూరు రంగస్వామి, సర్పంచి గోవిందరాజులు మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి వాలంటీరుకూ 50 గృహాలను కేటాయించారని తెలిపారు. వారికి ప్రభుత్వం నుంచి ఏ సమస్యనైనా పరిష్కరించేందుకు వాలంటీర్లు ఉన్నారని చెప్పారు. వాలంటీర్ల పరిధిలోని వారికే సరైన న్యాయం చేయలేకపోతే మీరుండి లాభం లేనప్పుడు తప్పుకోవడం మంచిదని సూచించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష'ను వాలంటీర్లు తేలికగా తీసుకుంటున్నారని మండిపడ్డారు. పనులు చేయలేని వాలంటీర్లకు తక్షణమే నోటీసు అందజేసి తీసేయాలని అధికారులను కోరారు. మంజూరయిన ధ్రువీకరణ పత్రాలను గుమ్మనూరు నారాయణ, సర్పంచి గోవిందరాజులు చేతులమీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఇఒఆర్‌డి సంజన్న, విఆర్ఒ తిమ్మప్ప పాల్గొన్నారు.

మొహర్రం వేడుకలకు తొలగిన అడ్డంకులు

మండలంలోని బంటనహాల్ గ్రామంలో 8 ఏళ్లుగా మొహర్రం వేడుకలు నిలిచిపోయాయి. గ్రామస్తులు శనివారం ఆలూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణను కలిసి మొహర్రం పండగ జరుపుకోవడానికి అనుమతులు ఇప్పించాలని కోరారు. స్పందించిన నారాయణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్‌తో మాట్లాడి మొహర్రం పండగను జరిపించేందుకు అనుమతులు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చిప్పగిరి ఎస్ఐ రమేష్ బాబు, మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, బంటనహాల్ గ్రామస్తులతో సమావేశమై పండగను ప్రశాంతంగా జరుపుకుంటామంటే అనుమతులు ఇస్తామని తెలిపారు. గ్రామస్తులంతా ఏకమై ప్రశాంతంగా జరుపుకుంటామని, అందుకు తామంతా సంతకాలు పెట్టిన పత్రాలను అందజేస్తామని చెప్పారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ మొహర్రం వేడుకలకు రూ.20 వేలను గ్రామస్తులకు విరాళంగా అందజేశారు. మొహర్రం వేడుకలకు అనుమతులు ఇప్పించినందుకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి మండల కన్వీనర్ ఏరూరు రంగస్వామి, ఆలూరు తాలూకా బూత్ కమిటీ సభ్యులు రాజన్న, గుమ్మనూరు శ్రీధర్, దొల్తాపురం సేకన్నా, వెంకటేష్, రంగముని, సూరి, రమేష్, రాఘవేంద్ర పాల్గొన్నారు.


మొహర్రం వేడుకలకు గ్రామ పెద్దలకు విరాళం అందజేస్తున్న నారాయణ

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి - కోసిగి రూరల్



మండలంలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని ఎస్ఐ సతీష్ కుమార్ హెచ్చరించారు. శనివారం కోసిగి ఎస్ఐగా సతీష్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. గతంలో పని చేసిన ఎస్ఐ రాజారెడ్డి బదిలీలో భాగంగా ఓర్వకల్లుకు బదిలీ అయ్యారు. ఆదోని ట్రాఫిక్ ఎస్ఐగా పని చేస్తున్న సతీష్ కుమార్‌ను కోసిగి ఎస్ఐగా పోలీసు శాఖ నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రశాంతంగా ఉన్న మండలంలో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, పరిష్కరిస్తామని తెలిపారు. ఎవరైనా కర్ణాటక మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

యునాని ఉచిత వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో సలాఫీ బైతుల్ మాల్ వెల్ఫేర్ సొసైటీ వారి ఆధ్వర్యంలో 8వ యునాని వైద్య శిబిరం విజయవంతమైంది. శనివారం 'మదరసా ఏ దారు సలాం'లో ముఖమీ జమాతే అహలేహదీస్ తరపున సలాఫీ బైతుల్ మాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించినట్లు నిర్వాహకులు మౌలానా ఉమర్ ఉమ్రి, మౌలానా మూస జమ్మియా, మానియర్ అమానుల్లా తెలిపారు. దాదాపు 150 మంది పేదలు దీర్ఘకాల వ్యాధులకు చికిత్స చేయించుకున్నారు. పేదలకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. రాబోయే రోజుల్లోనూ తమ సంస్థ తరపున సేవలు నిర్వాహకులు తెలిపారు. కొండపురి అబ్దుల్ ఖదీర్, సిఎండి.ముజీబ్, శాలిమార్ నజీర్, ఆతిక్ అబ్దుల్, వహబ్, మౌలానా, సిబగతుల్లా పాల్గొన్నారు.

చేతిపంపునకు మరమ్మతులు

పెద్దకడబూరు : పెద్దకడబూరు బీసీ కాలనీలో చెడిపోయిన చేతిపంపునకు శనివారం మెకానిక్ పౌలయ్య మరమ్మతులు చేపట్టారు. కాలనీలోని ప్రజల సహాయంతో బోరును బయటకు తీసి మరమ్మతులు చేశారు. మరమ్మతులు చేయడంతో చేతిపంపు నుంచి నీరు వచ్చింది. కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయకుంటే చర్యలు

- విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి - ఆదోని

క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయకుంటే చర్యలు తప్పవని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాల, క్రాంతి నగర్‌లోని సంతపేట పురపాలక పాఠశాల, వెంకన్న గేరి పాఠశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాశాఖ అధికారులను, ఉపాధ్యాయులను పరుగులు పెట్టించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటగా ఆర్ఆర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలను పరిశీలించారు. పదో తరగతి 'ఎ' సెక్షన్‌లోని విద్యార్థుల దగ్గరికి వెళ్లి జగనన్న విద్యా కానుక కిట్లను పరిశీలించారు. విద్యార్థుల బ్యాగుల్లోని నోట్ పుస్తకాలను, పాఠ్యపుస్తకాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులను ఎంత మంది ఇక్కడ పని చేస్తున్నారని, ఎంతమంది విద్యార్థులు ఉన్నారని ప్రశ్నించారు. 820 మంది విద్యార్థులకు పైగా ఉన్నారని, నలుగురే ఉపాధ్యాయులు ఉన్నారని, 6 నుంచి 10వ తరగతి వరకు వారే బోధిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ ఉపాధ్యాయులను ఎందుకు నియమించలేదని ఆర్‌జెడి, డిఇఒను ప్రశ్నించారు. విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా సబ్జెక్టు టీచర్లు లేకపోవడంతో విస్మయానికి గురయ్యారు. వేల మందికి పదోన్నతులు కల్పిస్తున్నా ఇంకా ఉపాధ్యాయుల కొరత ఉంటే విద్యార్థులకు బోధన ఎలా ముందుకు సాగుతుందని, వెంటనే ఇక్కడ విద్యార్థులకు నిష్పత్తికి అనుగుణంగా 13 మంది ఉపాధ్యాయులను వారం రోజుల్లోపు నియమించి తనకు నివేదిక ఇవ్వాలని ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశించారు. అక్కడి నుంచి సంతపేట పురపాలక ప్రాథమిక పాఠశాలకు వెళ్లారు. నేలపైనే కూర్చోవడంతో నాడు-నేడు కింద బెంచీలు ఎందుకు ఏర్పాటు చేసుకోలేదంటూ ఉపాధ్యాయులను ప్రశ్నించారు. ఇంత మంచి వాతావరణం, పాఠశాలను రూపురేఖలు మారిస్తే అనవసరమైన వాటికి ఖర్చులు చేశారే, తప్ప విద్యార్థులు కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేయకపోవడాన్ని తప్పు పట్టారు. కొద్దిసేపు విద్యార్థుల వర్క్ బుక్‌ను పరిశీలించారు. పాఠశాల ఉపాధ్యాయుడు వర్క్ బుక్‌ను కరెక్షన్ చేయకపోవడం, తప్పులు ఉండడంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. బడులు పునః ప్రారంభమై నెల రోజులైనా ఇంకా పుస్తకాలు కరెక్షన్ చేయకపోవడం మంచిది కాదని తెలిపారు. నిబద్ధతతో పని చేయాలంటూ చురకలు అంటించారు. ఉపాధ్యాయుడుపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వారం రోజుల్లోపు తనకు ఆయన పని తీరుపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు అందరూ నిర్దేశిత సమయంలో పాఠాలను విద్యార్థులకు బోధించాలని, ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను విద్యార్థులు వారి క్లాస్ వర్క్‌లో రాసే విధంగా చూడాలని సూచించారు. వారు ఎవైనా తప్పులు కాస్తే వాటిని కరెక్షన్స్ చేసి విద్యార్థులకు మళ్లీ వాటి గురించి వివరించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎందుకు పర్యటించడం లేదని డిఇఒ రంగారెడ్డిని ప్రశ్నించారు.


సూచనలు చేస్తున్న ప్రవీణ్ ప్రకాష్

పురపాలక అధికారులు, సచివాలయ సిబ్బందిపై అసహనం

వెంకన్న గేరిలో తన డాష్ బోర్డులో ఉన్న 15 మంది బడిబయట విద్యార్థులపై ఆచూకీ కోసం ఓ ఇంటికి వెళ్లారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పురపాలక అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. జిఆర్ యాప్‌లో వారు ఎక్కడున్నారు చెప్పాలంటూ సూచించారు. వారు నీళ్లు నమిలారు. మొబైల్ యాప్‌పై అవగాహన లేకపోవడం, కనీసం బడిబయట ఉన్న విద్యార్థుల వివరాలు తెలియకపోవడం జీతాలు ఇవ్వడం దండగ అన్నారు. బడికి రాకపోతే వారి ఇంటికి వెళ్లి బడిలో ఉండే విధంగా చూడాలన్నారు.

నేలపై కూర్చోడంపై విస్మయం

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులు నేలపై కూర్చొని పాఠాలు వింటుండడంతో విస్మయానికి గురయ్యారు. నాడు-నేడు కింద ఒక్కరు కూడా కింద కూర్చోరాదని రూ.కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. వృథాగా ప్రహరీకి, ఇతర వాటికి ఉపయోగించి అవసరమైన వాటికి వినియోగించకపోవడంపై ఇంటర్మీడియట్ బోర్డు డివిఇఒ పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. వెంటనే వారికి బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు.

సబ్ కలెక్టర్‌పై అసహనం

రెవెన్యూ విభాగం ఒక్కటే కాదని, పరిధిలోని అన్ని శాఖల పనితీరును మెరుగుపరచాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలా అంటూ ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌పై అసహనం వ్యక్తం చేశారు. తరచుగా తనిఖీలు నిర్వహించి పురోగతి వైపు అడుగులు వేయించాలని కోరారు. సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఇఒ రంగారెడ్డి, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీడీ డాక్టర్ వేణుగోపాల్, శామ్యూల్ పాల్, ఇంటర్మీడియట్ బోర్డు డివిఇఒ ఖాజా మోహిద్దీన్, ఎంఇఒలు శివరాములు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి : ఎస్ఎఫ్ఐ

ఆదోని మండలవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌కు వినతిపత్రం అందజేశారు. డివిజన్ నాయకులు శ్రీనివాసులు మాట్లాడుతూ... నాడు-నేడు పనులపై విచారణ జరిపి అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పించడంలో విఫలం

- విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి-ఆలూరు

పదో తరగతిలో ఫెయిలైన విద్యార్థులకు మళ్లీ పాఠశాలలో చేరి రెగ్యులర్‌గా పాసయ్యే అవకాశం ఉందని, వాటిపై అవగాహన కల్పించడంలో విఫలం చెందారని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ డిఇఒ రంగారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని పెద్దహోతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హాలహర్వి కెజిబివి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెద్దహోతూరు పాఠశాలలో విద్యార్థులకు ఇచ్చిన హోమ్ వర్క్‌పై ప్రశ్నలకు జవాబు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చెప్పిన జవాబులకు మెచ్చుకొని ఉపాధ్యాయులను ప్రశంసించారు. బూట్లు ధరించకుండా పాఠశాలకు చెప్పులతో వచ్చిన విద్యార్థులను ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రయివేట్ విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వం పుస్తకాలు, బ్యాగ్, యూనిఫారం, బూట్లు, సాక్సులు, బెల్టు ఇస్తోందని, వాటిని ధరించకుండా పాఠశాలకు పంపిస్తే విద్యార్థులకు క్రమశిక్షణ ఉండదని తల్లిదండ్రులకు తెలిపారు. నూతనంగా రూ.3 కోట్లతో నిర్మిస్తున్న జడ్‌పి ఉన్నత పాఠశాలను పరిశీలించారు. అనంతరం హాలహర్వి కెజిబివి పాఠశాలను తనిఖీ చేశారు. సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్, ఎంఇఒలు కోమలదేవి, ఈరన్న, జడ్‌పిటిసి లింగన్న పాల్గొన్నారు.



పెద్దహోతూరులో విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రవీణ్ ప్రకాష్

కంబదహాల్‌లో 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని కంబదహాల్ గ్రామంలో తహశీల్దార్ వీరేంద్ర గౌడ్, ఎంపిడిఒ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం 'జగనన్న సురక్ష' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వాలంటీర్లు గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలను తెలుసుకుని అధికారులు దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. వాటిని పరిష్కరించేందుకే వచ్చినట్లు చెప్పారు. వైసిపి నాయకులు రాఘవేంద్ర రెడ్డి, సర్పంచి దస్తగిరి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ఆదివారం 16 జూలై 2023
5
నంద్యాల





ఇండోర్ స్టేడియంను ప్రారంభిస్తున్న మంత్రి ఆర్‌కె రోజా

ఖరీఫ్ సాగు కష్టమే...

- ప్రాజెక్టుల్లో నీళ్లు నిల్.. మొండికేసిన వరుణుడు..
- ఆరుతడి పంటలే మేలంటున్న అధికారులు

ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్

ఈ ఏడాది ఖరీఫ్ సాగు కష్టంగానే ఉండబోతుంది... వర్షాకాలం ప్రారంభం అయినా నేటికీ వర్షం అనుకున్న రీతిలో పడకపోవడం, మేఘాలు మొండికేయడం వలన జిల్లాలో వివిధ ప్రాజెక్టుల కింద ఖరీఫ్ సాగు ముందుకు సాగడం లేదు. కేవలం నామ మాత్రంగానే రైతన్న సాగు చేస్తున్నాడు. జిల్లాలో ఇప్పటికే వేసిన కంది, మొక్కజొన్న, పత్తి వంటిపైర్లు వర్షం రాక ఎండిపోతున్నాయి. వరి సాగుకు రైతన్న అడుగు వేస్తున్నా ప్రాజెక్టులలో పూర్తి స్థాయిలో నీరు లేకపోవడంతో రైతన్న సంసిద్ధంలో పడ్డాడు. ఇంకా వర్షాలు లేటు కావ్చనే అభిప్రాయం అధికారులలో వ్యక్తం అవుతుంది. అరుతడి పంటలు వేసుకోవాలని ఇరిగేషన్ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ప్రాజెక్టుల వారీగా నీటి నిల్వలు పరిశీలిస్తే జిల్లాలో కేవలం తాగు నీటి అవసరాలకు సరిపడ నీళ్లు మాత్రమే ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. శ్రీశైలం ప్రాజెక్ట్ లో కేవలం 33 టిఎం లు మాత్రమే నీరు నిల్వ ఉండగా వెలుగోడు రిజర్వాయర్ లో 1.6 టిఎంసిలు, ఎస్ఆర్‌బిసి కింద ఉన్న గోరుకల్లు రిజర్వాయర్ లో 1.9 టిఎంసి, ఔకు రిజర్వాయర్‌లో 1.6 టిఎంసిలు నిల్వలు ఉన్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఉన్న నీరు పంటలకు వదిలితే కేవలం 15 నుండి 20 రోజులు మాత్రమే వస్తుంది. అందువల్ల ఉన్న నీటిని వ్యవసాయ పంటలకు వాడితే ప్రజల దాహార్తీ తీర్చడానికి కష్టం అవుతుందనే ఉద్దేశ్యం తో ప్రాజెక్టులలో ఉన్న అరకొర నీటిని ప్రజల



అడుగంటిన శ్రీశైలం డ్యాం నీటి మట్టం

తాగు నీటి అవసరాల కోసం ఉంచినట్లు అధికారులు చెబుతున్నారు.గత ఏడాది ఈ పాటికి పైన కర్ణాటక మహారాష్ట్రలలో బాగా వర్షాలు పడటం, వరదలు రావడం వల్ల ఆల్మట్టి డ్యామ్ పూర్తిస్థాయిలో నిండి కిందికి రావడంతో తుంగభద్ర డ్యామ్ పూర్తి స్థాయిలో వరదనీరు వచ్చి చేరడంతో సుంకేసుల బ్యారేజికి ఇన్‌ఫ్లో పెరిగి ఈ సమయానికి సుంకేసుల నుండి కెసికి నీరు వదిలారు. అలాగే శ్రీశైలం ప్రాజెక్టుకు కూడా అనుకున్న స్థాయిలో నీరు వచ్చి చేరడంతో ఎస్ఆర్‌బిసి, తెలుగు గంగా ప్రాజెక్టు కింద నీరు వదలారు. ఈ ఏడాది ఎగువ రాష్ట్రాలు కర్ణాటక, మహారాష్ట్ర లోనూ వర్షాలు అనుకున్న స్థాయిలో పడలేదు. దీంతో ప్రాజెక్టులలో నీరు చేరకపోవడంతో దిగువ ప్రాజెక్టులు వెలవెల పోతున్నాయి. ఆ ప్రభావం కర్నూలు ఉమ్మడి జిల్లా పైన పడింది. ప్రస్తుతం ఆల్మట్టి డ్యామ్‌లో 10 టిఎంసిలు, తుంగభద్ర డ్యామ్ లో 6 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నట్లు సమాచారం. కేవలం ఈ ప్రాజెక్టులకు ఇన్ ఫ్లో 900 నుండి 1000 క్యూసెక్కులు నీరు వచ్చి చేరుతుంది. అందువల్ల ప్రాజెక్టుల కింద ప్రస్తుత పరిస్థితుల్లో నీటి ఆధారిత పంటలు సాగు కష్టమని అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. గత ఏడాది ఖరీఫ్ సీజన్ లోఈ సమయానికి కెసికి నీళ్ల వదిలిన అధికారులు... ప్రాజెక్టులలో నీరు లేకపోవడంతో సైలెంట్‌గా ఉన్నారు. ఇప్పటికే వర్షభావ పరిస్థితులు నెలకొనడంతో పాటు ఈ నెల చివరి నాటికల్లా వర్షాలు రాకుంటే కరువు ఛాయలు ఏర్పడే అవకాశాలు లేక పోలేదనే అభిప్రాయం నీటి పారుదల శాఖ అధికారుల్లో వ్యక్తం అవుతుంది. వర్షాలు ఆలస్యం అయ్యే అవకాశాలు కనపడుతున్నందున వరి వంటి సాగుకు ప్రత్యామ్నాయంగా అరుతడి పంటలు వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఆరుతడి పంటలు మేలు



జిల్లాలో వర్షాలు అనుకున్న సమయానికి పడకపోవడంతో వర్షభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు ఈ ఖరీఫ్‌లో ఆరుతడి పంటలు సాగు చేసుకుంటేనే బాగుంటుంది. ప్రాజెక్టులలో కూడా నీరు సమృద్ధిగా లేనందున వరి, నీటి ఆధారిత పంటలు సాగు చేసుకుంటే రైతులు నష్టపోయో అవకాశాలు ఉన్నందున కెసి.కెనాల్ కింద, ఎస్ఆర్‌బి సి కింద అరుతడి పంటలను వేసుకోవాలి.

- రమణయ్య, ఎస్ఇ, నీటిపారుదల శాఖ నంద్యాల జిల్లా.

వర్షాధార పంటలు మాత్రమే వేసుకోండి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా కెసి కెనాల్, తెలుగు గంగ, ఎస్సార్‌బీసీ ఆయుకట్టు దారులు ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షాధార పంటలు మాత్రమే వేసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఖరీఫ్ సీజన్ మొదలైనప్పటి నుంచి కృష్ణా, తుంగభద్ర నదులలో నీటి ప్రవాహం లేనందున, అలాగే శ్రీశైల జలాశయంలో ప్రస్తుత నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకొని కెనాల్, తెలుగు గంగ, ఎస్సార్ బీసీ ఆయుకట్టుదారులు వర్షాధార పంటలు మాత్రమే వేసుకోవాలని సూచించారు. తొందరపడి వరి వేసుకోరాదని పేర్కొన్నారు. నదులలో ఇన్ ఫ్లో ఆధారంగా తుంగభద్ర, శ్రీశైలం జలాశయాలకు నీరు చేరిన తర్వాత ఖరీఫ్ పంటలకు నీటి సరాఫరాపై ఐఎబి సమావేశంలో తీర్మానించి రైతులకు తెలియజేస్తామని తెలిపారు.

గ్రామ పంచాయతీ కార్మికులకు

ఉద్యోగ భద్రత కల్పించాలి : సిఐటియు

ప్రజాశక్తి - నంద్యాల

గ్రామ పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నంద్యాల పట్టణంలోని నరసింహయ్య భవన్‌లో గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా సమావేశం అబ్బాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడారు. జీవో 551 ప్రకారం టెండర్ విధానం రద్దు చేయాలని, 2015కి పూర్వం ఉన్న గ్రామపంచాయతీ కార్మికులను టెండర్ విధానం నుంచి మినహాయించాలని హైకోర్టు తీర్పునిచ్చినా ఎక్కడా అమలు చేయడం లేదన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులకు టైం స్కేలు అమలు చేసి, సిబ్బందికి 010 ద్వారా ప్రభుత్వం వేతనాలు చెల్లించాలని కోరారు. ఇటీవల కాలంలో నిత్యవసర వస్తువుల ధరలు 300 శాతం పెరిగాయని, కానీ గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం ఎక్కడా అమలు చేయడం లేదని తెలిపారు. చాలీచాలని జీతాలతో గ్రామ పంచాయతీ కార్మికులకు కుటుంబాలను పోషించుకోవడం చాలా ఇబ్బందిగా ఉందన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు బెదిరింపులు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామ పంచాయతీ కార్మికులకు సెలవులు వర్తింపచేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ అమలు చేయాలని, అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న మండల కేంద్రాల్లో, ఆగస్టు 4న కలెక్టర్ కార్యాలయం దగ్గర నిరసన కార్యక్రమం ఉంటుందని, జిల్లాలోని కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ సీనియర్ జిల్లా నాయకులు వలి, లక్ష్మన్న, జాన్, శిఖామణి, వెంకటరాముడు, నాగన్న, మద్దిలేటి, నరసింహులు, నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం

మంత్రి ఆర్‌కె రోజా పర్యటన

- ఇండోర్ స్టేడియాలు ప్రారంభం

ప్రజాశక్తి - నందికొట్కూరు/పగిడ్యాల

నందికొట్కూరు పట్టణం, పగిడ్యాలలో రూ.2.38 కోట్ల వ్యయంతో నిర్మించిన ఇండోర్ స్టేడియాలను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె.రోజా శనివారం ప్రారంభించారు. నందికొట్కూరు పట్టణానికి చేరుకున్న మంత్రికి స్థానిక రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆధ్వర్యంలో మార్కెట్ యార్డు వద్ద ఘన స్వాగతం పలికారు. అక్కడి నుండి ఇండోర్ స్టేడియం వరకు సుమారు 3 వేల పైగా బైకులతో ర్యాలీ నిర్వహించారు. ఓల్డ్ బిఎస్ఆర్ ఆధ్వర్యంలో గజమాలతో సత్కరించారు. అనంతరం మంత్రి ఆర్కే రోజా, బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి మినీ స్టేడియాన్ని ప్రారంభించారు. అనంతరం పగిడ్యాలలో కూడా భారీ ఊరేగింపు నిర్వహించారు. మంత్రి రోజా, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డికి మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి, జడ్పిటిసి పుల్యాల దివ్య, ఎంపిపి మండ్ల మల్లేశ్వరి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఎస్‌సి కాలనీలోని అంబేద్కర్, డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు ఆమె పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ అవతల పార్టీలు బోరుకొచ్చాయని, రాష్ట్రంలో ఎక్కడ కూడా జాకీలు పెట్టే లేపే పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. ఆగస్టు, సెప్టెంబర్ మధ్యలో జిల్లా మంత్రులను, ఎమ్మెల్యేలను పిలిచి 50 వేల మందితో బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం నంది కొట్కూరులో, పగిడ్యాలలో ఇండోర్ స్టేడియాలు నిర్మాణం పూర్తి చేశామన్నారు. కెసి కెనాల్‌పై నూతన బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి ఉంచామని, త్వరలో పనులు చేపడతామన్నారు. ఇండోర్ స్టేడియాల ప్రారంభానికి పిలవగానే వచ్చిన మంత్రి రోజాకి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఇండోర్ స్టేడియాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి నివాసమైన ముచ్చుమర్రి గ్రామానికి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, తహశీల్దార్ రాజశేఖర్ బాబు, స్వామిదాస్ రవికుమార్, పేరుమాల శ్రీనాథ్, శ్రీనంది కాలేజ్ ప్రిన్సిపల్ బద్దల శ్రీకాంత్, బద్దల శ్రీధర్, బసిరెడ్డి కాలేజ్ డైరెక్టర్ రమేష్ రెడ్డి, రమేష్ నాయుడు, బిజినవేముల సర్పంచ్ రవి యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ అర్షపోగు ప్రశాంతి, చిన్న రాజు, బొల్లెద్దుల రామకృష్ణ, లాలూ ప్రసాద్, ఉస్మాన్ బేగ్, చాంద్బాషా, అల్లూరి కష్ణ, అబ్దుల్ రాహుఫ్, నాయబ్, పబ్బాతి రవికుమార్, ఎంపీపీ మురళి కృష్ణారెడ్డి, బొల్లవరం ఉపసర్పంచ్ సురేష్ యాదవ్, కేశవరెడ్డి, నాగార్జున రెడ్డి,పగిడ్యాల సర్పంచి పెరుమాళ్ళ శేషన్న, మండల ఉపాధ్యక్షు రాలు పల్లె అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ ఏర్పాటుపై చర్చ

మంత్రి ఆర్‌కె.రోజా పర్యటన సందర్భంగా నందికొట్కూరు, పగిడ్యాలలలో వెలిసిన ఫ్లెక్సీలలో స్థానిక ఎమ్మెల్యే తోగురు ఆర్థర్ ఫొటో లేకపోవడం చర్చనీయాంశమైంది. సభకు అధికార పార్టీ ఎమ్మెల్యే ఎందుకు దూరమున్నారనేది కూడా కార్యకర్తలు చర్చించుకున్నారు. ఎమ్మెల్యే సొంత పనుల మీద క్యాంపు వెళ్లినట్లు ఆయన వర్గీయులు తెలిపారు. బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఎమ్మెల్యే ఆర్థర్ మధ్య వర్గ విబేధాలున్నాయని అందుకే రాలేదని అనుకుంటున్నారు.

కదంతొక్కిన అంగన్వాడీలు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీలు కదం తొక్కారు. కర్నూలు ధర్నా చౌక్, నంద్యాల కలెక్టరేట్ వద్ద 36 గంటల మహా ధర్నాలు చేపట్టారు. రాత్రి పూట కూడా అక్కడే జాగారం చేశారు. నిర్విరామంగా ఆందోళన సాగించారు. రెండో రోజు కర్నూలులో కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. నంద్యాలలో నూనె పల్లె ఫ్లై ఓవర్ వరకు ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేపట్టారు. ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేయాలని మోడీ ప్రభుత్వం చూస్తోందన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మహా పాదయాత్రకు సన్నద్ధం

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఈనెల 26 నుంచి 31 వరకు కర్నూలు జిల్లావ్యాప్తంగా నిర్వహించే మహా పాదయాత్ర కోసం సిపిఎం ఆధ్వర్యంలో విస్తతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రధానంగా కర్నూలు నగరంలో ఇంటింటికి తిరిగి సిపిఎం బృందాలు సమస్యలను సేకరిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాల్లో సమావేశాలు, సభలు నిర్వహించి మహాపాదయాత్ర ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం రూ.10 వేల కోట్లు కేటాయించాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరింది. జిల్లా కేంద్రం నుంచి రాజధాని అమరావతికి రోడ్డు, రైలు మార్గాలు వేసి, కర్నూలు నుంచి అమరావతికి రెగ్యులర్ రైలు నడపాలన్నారు. రైల్వే వ్యాగన్ వర్క్ షాప్‌ను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆదోని, ఎమ్మిగనూరులలో టెక్స్‌టైల్స్ పార్కులను నిర్మించాలన్నారు. సమస్యల పరిష్కారానికి సిపిఎం దశలవారీ ఆందోళనల్లో భాగంగా ఈనెల 10 వరకు గ్రామాల్లో, వార్డుల్లో పర్యటించి స్థానిక సమస్యలను గుర్తించి సచివాలయాల్లో వినతి పత్రాలు అందజేస్తున్నారు. రెండో దశలో 11, 12, 13న కరపత్రాలు వేసి అన్ని నియోజకవర్గాలలో ఆరుజీపు జాతాల ద్వారా ప్రచారం చేపట్టారు.





మాట్లాడుతున్న శ్రీనివాస చార్యులు

అర్చకుల పర్యవేక్షణలోకి ఆలయాలు

- అర్చక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచార్యులు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : రాష్ట్రంలో 21,500 దేవాలయాలు అర్చకుల పర్యవేక్షణలోకి వచ్చే విధంగా ప్రభుత్వం జీవో విడుదల చేసినట్లు రాష్ట్ర అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శి శ్రీనివాసాచార్యులు తెలిపారు. శనివారం సిరివెళ్ల మండలం కోటపాడు గ్రామంలో జిల్లాలోని అర్చక సమాఖ్య ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల రూపాయల ఆదాయంలోపు ఆలయాలు అర్చక పురోహితులకు అప్పజెప్పి గ్రామ ప్రజలు, అర్చకులు సమన్వయంతో ఆలయ పర్యవేక్షణ నిర్వహించి ధూప దీప నైవేద్యాలు నిత్యం జరిగే విధంగా ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. అర్చక పురోహితులకు నేడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఒక ఆశా కిరణం లాంటిదన్నారు. అర్చకులు, పురోహితులు, వేద పండితుల సమస్యలను చట్టసభల్లో వినిపించే గొంతు తమకు లేనందున అర్చక సమాఖ్య తరపున చట్టసభల్లో అర్చక ఎమ్మెల్సీని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మహానంది ఆలయ ఉప ప్రధాన అర్చకులు జనార్దన్ శర్మ, జిల్లా అర్చక సమాఖ్య కార్యదర్శి మదన గోపాలాచార్యులు, రాజేష్ కోదండపాణి, నల్లగట్ల సూర్యరావు, యాగంటి పల్లె నరసింహయ్య, సుంకేసుల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ దేవాలయానికి విరాళం

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని టంగుటూరు పెద్దమ్మ ఆలయానికి వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డి రూ 50 వేలు విరాళంగా శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భార్గవ రెడ్డి, ఉమామహేశ్వర రెడ్డి, భాస్కర్ రెడ్డి, దాసి చంద్రశేఖర్ రెడ్డి, బాలగంగాధర్ రెడ్డి, నెమలి తిరుపం రెడ్డి, మహిపాల్ రెడ్డి, ఖాతా వెంకట సుబ్బారెడ్డి, చీరాల వెంకటస్వామి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



విరాళం ఇస్తున్న వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డి

పవన్‌కు ఫ్యాన్స్ మాత్రమే.. జగనన్నకు సోల్జర్స్..

- రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, యువజన శాఖ మంత్రి ఆర్‌కె రోజా

ప్రజాశక్తి - పగిడ్యాల

పవన్ కళ్యాణ్‌కు ఫ్యాన్స్ ఉంటే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి సోల్జర్స్ ఉన్నారని, జగనన్న కోసం ప్రాణాలు ఇచ్చే వారు ఎంతో మంది ఉన్నారని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక యువజన శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. శనివారం పగిడ్యాల మండలం పాత ముచ్చుమర్రి గ్రామంలో శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి ఆర్కే రోజా మాట్లాడారు. 'సిఎంను, మంత్రులను, ఎమ్మెల్యేలను పవన్ కళ్యాణ్ వాడు అని మాట్లాడాడు. అసలు వాడెవడు' అని మండిపడ్డారు. 'పవన్ కళ్యాణ్‌కు మెంటల్ వచ్చింది. మెంటల్ ఆసుపత్రి నుంచి పారిపోయి వచ్చినవారు మాట్లాడినట్లు మాట్లాడుతున్నాడు. విప్లవకారుడినని పవన్ చెప్పుకోవడం సిగ్గుచేటు. విప్లవకారుడు అంటే ఎలా ఉంటారో తెలుసా' అని పవన్ కళ్యాణ్‌ను ప్రశ్నించారు. 'రెండు చోట్ల పోటీ చేసి ఓడిపోయిన నువ్వు జగనన్న గురించి మాట్లాడడం సిగ్గుగా ఉంది. పవన్ కళ్యాణ్‌కు ఆంధ్రలో ఇల్లు లేదు. వార్డు మెంబర్‌గా కూడా గెలవలేవు' అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్షాలతో ముఖ్యమంత్రి జగనన్న ఒక ఆట ఆడుకుంటారని తెలిపారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో క్రీడా కార్యక్రమాలు చేపట్టి, క్రీడల అభివృద్ధి కోసం దాదాపు రూ. 5 కోట్లు ఖర్చు చేసి క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎదిగేలా నగదు బహుమతులు అందజేశామన్నారు. క్రీడాకారిణి పివి సింధు ఫటా ఫటా ఆట ఆడినట్టు సిఎం జగనన్న పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడులను ఆడుకొని వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లో వైసిపి జెండా ఎగరేస్తుందన్నారు. అనంతరం శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లోకి వచ్చి ఐదేళ్ల తర్వాత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైసిపిలో అవకాశం ఇచ్చారని, ఆయనకు ఎంతో రుణపడి ఉన్నానని అన్నారు. స్థానిక సంస్థల్లో ఎంపిటిసిలు, జడ్పిటిసిలు, సర్పంచులను గెలిపించుకున్నామని తెలిపారు. నందికొట్కూరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రూ.16 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని, నియోజకవర్గానికి 14, 15వ ఆర్థిక సంఘం నిధులు, జనరల్ ఫండ్ రూ.30 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి కూడా లక్షల్లో నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. కొలనుభారతి, సంగమేశ్వరం ఆలయాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని మంత్రి రోజాకు విన్నవించారు. నెహ్రూ నగర్ గ్రామంలోని కృష్ణానదిపై బోటు నడుపుకుంటూ జీవనం సాగించే వాళ్ళు ఉన్నారని, బోటు నడుపుకునే విధంగా వారికి అవకాశం కల్పించాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆర్‌కె రోజా

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులను పరిష్కరించండి

- జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను జాప్యం చేయకుండా సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలుపై జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ ఎస్,సి ఎస్టీల అట్రాసిటీ కేసులు దీర్ఘకాలం పెండింగ్‌లో ఉండకుండా వేగవంత పరిష్కారానికి జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కూడా అధికారులకు సహకరించాలని కోరారు. విచారణలో సాక్షులు సహకరించేలా చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ కేసులు ఆళ్లగడ్డలో 11, ఆత్మకూరులో 7, డోన్‌లో 6, నంద్యాలలో 2, ఎస్సీ, ఎస్టీ సెల్‌కు సంబంధించిన 4 కేసుల వివరాలు అడిగి తెలుసుకొని 20 రోజుల్లో క్లియర్ చేయాలని సబ్ డివిజనల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. వచ్చే సమావేశానికి పబ్లిక్ ప్రాసిక్యూటర్ హాజరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి బి. పుల్లయ్య మాట్లాడుతూ గత ఏడాది ఏప్రిల్ నుండి డిసెంబర్ వరకు ఎఫ్ఐఆర్ నమోదైన 69 కేసులకు సంబంధించిన 102 మంది బాధితులకు రూ. 1.6 కోట్లు, ఈ ఏడాది జనవరి నుండి మార్చి వరకు ఎఫ్ఐఆర్ నమోదైన 21 కేసులకు సంబంధించిన 62 మంది బాధితులకు రూ.1.36 కోట్లు, ఏప్రిల్ నుండి జూన్ వరకు 45 కేసులకు సంబంధించిన 81 మంది బాధితులకు రూ.93.26 లక్షల పరిహారం చెల్లించినట్లు తెలిపారు. జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు జీవన్ రాజు, రమేష్, చిటికల సలోమి, దిలీప్ రాజు, అశోక్ నాయక్, మమత, శ్రీనివాసులు సూచించిన అంశాలన్నిటిపై నివేదికలు తెప్పించుకొని సత్వరమే పరిష్కరించి నష్టపరిహారాన్ని చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. గడివేముల, కొలిమిగుండ్ల, నంద్యాల, సిరివెళ్ల, సంజామల మండలాలలో పౌర హక్కుల దినోత్సవం జరగలేదని, ప్రతి నెలా 30వ తేదీ నిర్వహించేందుకు తహశీల్దార్లకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ జి.వెంకట రాముడు, సాంఘిక సంక్షేమ శాఖ డిడి చింతామణి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చిటికెల సలోమి, జీవన్ రాజు, రమేష్, దిలీప్ రాజు, అశోక్ నాయక్, మమత, శ్రీనివాసులు, కమిటీ అధికారిక సభ్యులు, నంద్యాల, డోన్, ఆత్మకూరు డివిజన్ల డిఎస్పీలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి



కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు

'బాల అకాడమీ'లో ఊదారంగు కార్యక్రమం

ప్రజాశక్తి - నంద్యాల : నంద్యాల పట్టణంలోని బాల అకాడమీ పాఠశాలలో శనివారం 'రంగులు – ప్రత్యేకతలు' కార్యక్రమంలో భాగంగా ఊదారంగు ఆక్టివిటీ చిన్నారులు, ఉపాధ్యాయ బృందం ఎంతో ఆహ్లాదకరంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు వంగపండు దుస్తులు ధరించి, వంగపండు రంగు ఆట వస్తువులు తీసుకొచ్చారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన కరెస్పాండెంట్ ఎంజివి రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీ లత హాజరై మాట్లాడారు. ఇంద్రధనస్సు లోపలి అంచున ఉన్న ఏడవది వంగపండు రంగని అన్నారు. ఈ రంగుని ఊదారంగు అనికూడా పిలుస్తారని తెలిపారు. కార్యక్రమంలో చిన్నారులు, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాబాయి దేశముఖ్ జయంతి : పట్టణంలోని పార్కు రోడ్డు సమీపంలో గల బాల అకాడమీ పాఠశాలలో దుర్గాబాయ్ దేశముఖ్ జయంతి వేడుకలను నిర్వహించారు. పాఠశాల కరెస్పాడెంట్ రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ మాధవీ లత మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సమర యోధురాలు, సంఘ సంస్కర్త, రచయిత్రి, న్యాయవాది, సామాజిక కార్యకర్త దుర్గాబాయ్ దేశముఖ్ సేవలు ఎనలేనివని వివరించారు.

కోటకొండలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - రుద్రవరం : మండలంలోని కోటకొండ గ్రామంలో మాల స్మశాన కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు గోశాల ఇసాక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజల అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో షుగర్, బిపి, వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాల స్మశాన కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సాల్మన్ ,రాష్ట్ర కార్యదర్శి బాల మద్దయ్య, మండల అధ్యక్షుడు వెంకటయ్య, సభ్యులు, డాక్టర్లు, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో పాల్గొన్న నాయకులు





మాట్లాడుతున్న ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మల

పనితీరును మార్చుకోవాలి

- జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మల

ప్రజాశక్తి-డోన్

అంగన్వాడీ కార్యకర్తల పనితీరును మార్చుకోవాలని నంద్యాల జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మల సూచించారు. శనివారం డోన్ పట్టణంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని డోన్ బేతంచెర్ల ప్యాపిలి మండలాలకు సంబంధించిన అంగన్వాడీ కార్యకర్తలకు డోన్ ఐసిడిఎస్ సిడిపిఓ షంషాద్ బేగం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఐసిడిఎస్ పిడి హాజరయ్యారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ నాడు నేడు కింద మంజూరు అయిన అంగన్వాడి భవనములను తొందరగా పూర్తి చేయించేందుకు కృషి చేయాల న్నారు. ఆగస్టు 1వ తేదీ నుంచి గర్భవతులు, బాలింతలకు వైఎస్ఆర్ కిట్లు ఇంటికే ఇవ్వడం జరుగుతుందన్నారు. సూపర్వైజర్లు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.



పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న కామేశ్వర్ రావు

వ్యాధుల పట్ల అప్రమత్తం

- జిల్లా మలేరియా నివారణ అధికారి

ప్రజాశక్తి - చాగలమర్రి

వర్షాకాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణ అధికారి కామేశ్వరరావు సూచించారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి పట్టణంలోని 4వార్డులో పర్యటించారు. పారిశుధ్యంపై ఇంటి యజమానులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు వారి వారి ఇళ్ళ వద్ద నీటిని నిల్వ ఉంచుకోరాదన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి, వైద్యాధికారి అంజలి సూపర్వైజర్ రామలింగారెడ్డి ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

రాయల్టీ లేకుండా వెళ్తే కేసు

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండలంలోని పలుకూరు, రామకృష్ణాపురం గ్రామాల నుండి బేతంచెర్లకు నాపరాల లోటుతో వస్తున్న వాహనాలు లేకుండా సరఫరా చేస్తే తప్పకుండా కేసులు నమోదు చేస్తామని రాయల్టీ టెక్నికల్ ఇన్స్పెక్టర్ బాలు నాయక్ అన్నారు. శనివారం రాయల్టీలు లేకుండా నాపరాళ్ల లోడుతో హైదరాబాద్ కు వెళ్తున్న పట్టుకొని కేసు నమోదు చేసి, ఒక్కొక్క లారీపై 20 వేల రూపాయల చొప్పున జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.



మాట్లాడుతున్న నాయకులు

మండల కన్వీనర్‌గా చెల్లె హరినాథ్ రెడ్డిని కొనసాగించాలి

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు టిడిపి మండల కన్వీనర్‌గా కొనసాగుతున్న హరినాథ్ రెడ్డిని ఏకపక్షంగా అధిష్టానం తొలగించడం బాధాకరమని కొందరు తెలుగు తమ్ముళు అభిప్రాయపడ్డారు. శనివారం సాయంత్రం మండలంలోని వివిధ గ్రామాల టిడిపి నాయకులు కార్యకర్తలు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధిష్టానం అందరిని సమావేశపరిచి అభిప్రాయ సేకరణ తీసుకొని ఉంటే బాగుండేదని వారన్నారు. హరినాథ్ రెడ్డినే మండల కన్వీనర్‌గా కొనసాగించాలని, లేనిపక్షంలో తదుపరి కార్యక్రమాన్ని ప్రకటిస్తామన్నారు. హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుండి పార్టీ కోసం పనిచేస్తున్నప్పటికీ ఒక మాట చెప్పకుండా తొలగించడం సమంజ సం కాదన్నారు. కార్యకర్తల అభిప్రాయం మేరకు తదుపరి కార్యచరణ చేపడతానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్ రెడ్డి, శివశంకర్ స్వామి, స్వాములు, లింగాల సర్పంచ్ బాల మల్లీశ్వరి రెడ్డి, భాస్కర్ రెడ్డి, రామ చౌదరి, అబ్దుల్ ఆఫీస్, సుంకన్న ,అంకన్న, హనుమంతు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

శేషారెడ్డి పేరును రాజకీయాలు తగదు : వైసిపి

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచర్ల పట్టణం లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేసి భూగర్భ కన్య సంపదను కనిపెట్టి మండలానికి మైనింగ్ వ్యాపారం జరుగుటకు బాటలు వేసిన మహనీయుడు బిపి శేషారెడ్డి పేరును అనవసరంగా రాజకీయాల్లోకి లాగితే ప్రజలే టిడిపి నాయకులకు తగిన గుణపాఠం చెప్తారని బేతంచెర్ల మండలం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి అన్నారు. బేతంచెర్ల మండల కేంద్రంలోని వైయస్సార్ పార్టీ కార్యాలయము నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పొదుపు మహిళల దగ్గర ఒక గ్రూపు నుండి రూ.2000 వసూలు చేసినామని టిడిపి నాయకులు అనవసరమైన అబద్ధాల మాటలు మాట్లాడడం తగదన్నారు. ఒక్క పొదుపు లక్ష్మి గ్రూపుల దగ్గర 100 రూపాయలు వసూలు చేసినట్లు నిరూపిస్తే తన చైర్మన్ పదవికి రాజీనామా చేస్తానని బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. నిరూపించ లేకపోతే ధర్మవరం సుబ్బారెడ్డి రాజకీయానికి స్వస్తి పలికి ఇంటి దగ్గరే కూర్చుంటారా అని సవాల్ విశారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు బాబుల్ రెడ్డి, తిరుమలేశ్వర్ రెడ్డి, కోడె వెంకటేశ్వర్లు, గూని నాగరాజు,రామానాయుడు, కృష్ణుడు, చంద్రశేఖర్, ఎద్దులన్న, మద్దయ్య, నాగేశ్వరరావు ,తిమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

18న ధర్నాను జయప్రదం చేయండి

సిఐటియు, ఆశా వర్కర్స్ యూనియన్ నేతలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి ఈ నెల 18న నంద్యాల డిఎంహెచ్ఒ కార్యాలయం దగ్గర జరిగే ధర్నాలో ఆశా వర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. శనివారం నంద్యాల టౌన్‌లోని అర్బన్ ఆరోగ్య కేంద్ర కేంద్రాల డాక్టర్లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు శివమ్మ, షమీమ్‌లు మాట్లాడుతూ ఆశావర్కర్స్‌తో సంబంధం లేని పనులు చేయించరాదని, వేధింపులు, బెదిరింపులు ఆపాలన్నారు. ప్రభుత్వ సెలవులు మంజూరు చేయాలని, నాణ్యమైన సెల్ఫోన్ 4జీ సిమ్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 14 రకాల యాప్లను డౌన్లోడ్ చేసుకోవాలని, వాటి నుంచే పని చేయాలని, 26 రకాల రికార్డులు రాయాలని ప్రభుత్వం హుకూం చేసిందని, సెల్ఫోన్ పని చేయకపోతే చేతి నుండి డబ్బులు పెట్టుకొని కొనుగోలు చేసి పనులు చేయాలని అధికారులు చెప్పడం తగదన్నారు. రికార్డులు కూడా సొంత డబ్బులతో కొనుగోలు చేయాలని లేకుంటే వేతనాలు కట్ చేస్తామని, ఉద్యోగం నుండి తొలగిస్తామని అధికారుల నుండి బెదిరింపులు, వేధింపులు వస్తున్నాయని, ఆన్లైన్ వర్కులు శిక్షణ లేక పోవడంతో ఆశ వర్కర్స్ తీవ్ర ఆందోళనకు, మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఆశా వర్కర్స్‌ని రోజు సచివాలయంలో ఉదయం తొమ్మిది నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఉండాలని, రెండుసార్లు ఉదయం, సాయంకాలం రిజిస్టర్లో సంతకాలు చేయాలని అధికారులు వేధిస్తున్నారని అన్నారు. ఆశ వర్కర్స్‌కు 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలన్నారు. నేటికీ ఆశ వర్కర్స్‌తో వ్యాక్సిన్ బాక్సులు తెప్పిస్తున్నారని, ఇది ఒక వర్కర్ల డ్యూటీ కాదని, కాబట్టి జిల్లా వైద్యాధికారి వెంటనే ఆశావర్కర్లతో సంబంధం లేని పనులు చేయించరాదని తగిన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లలిత, లక్ష్మీదేవి, శిరోమణి, నాగమణి, వసంత,తదితరులు పాల్గొన్నారు. **మిడుతూరు :** ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికై ఈనెల 18న నంద్యాల డిఎంహెచ్వో కార్యాలయం దగ్గర జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి జి నాగమణి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు బి వెంక లక్ష్మమ్మ ఆశ వర్కర్స్‌ను కోరారు. తలముడిపి గ్రామ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వైద్యాధికారి మద్దిలేటి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చిట్టెమ్మ, సుభద్రమ్మ తదితరులు పాల్గొన్నారు. **ప్యాపిలి :** ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి.శివరాం, మండల కార్యదర్శి ఎస్.ఎ.చిన్న రెహమాన్,ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు చౌడేశ్వరి, లక్ష్మీదేవి, కృష్ణవేణి ఆశాలను కోరారు. మండల పరిధిలోని జలదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వైద్యాధికారిణి డాక్టర్ నస్రత్ జహీరాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. **గడివేముల :** మండలం పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు బీహెచ్ఎన్ శాలేశ్వరమ్మకి సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి నాగమణి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. ప్రభావతమ్మ, మహేశ్వరమ్మ, మేరమ్మ, తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కొరకై ఈనెల 18వ తేదీన డిఎంహెచ్ఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తు న్నట్లు ఆశా వర్కర్స్ పేర్కొన్నారు. ఈ మేరకు పర్మిషన్ ఇవ్వాలని కోరుతూ శనివారం నాడు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నందికొట్కూర్ పట్టణ అర్బన్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ ప్రియాంకకు, బ్రాహ్మణకొట్కూర్ మెడికల్ ఆఫీసర్ మనోజ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఆశ వర్కర్ల పని భారాన్ని తగ్గించాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్స్, వెంటనే అమలు, తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నజిరున్నిసా, ఉమాదేవి, వెంకటలక్ష్మి, జ్యోతి, చెన్నమ్మ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఏపి ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సి.నాగేంద్రమ్మ,అర్. వెంకటలక్ష్మిలు కోరారు. ఈ మేరకు ఆర్ఎస్ రంగాపురం గ్రామం పి.హెచ్.సి.లోని డాక్టర్ భార్గవికి, బేతంచర్ల పట్టణం గౌరీపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో డాక్టర్ మౌనికలకు వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్ల మండల కమిటి సభ్యులు వై.పుష్పావతి,జి. నాగేంద్రమ్మ,బేతంచర్ల పుష్పావతిలతో పాటు ఆశా వర్కర్లు జె.శాంతమ్మ,జి. రమాదేవి,రాజేశ్వరి, రాజ్యలక్ష్మి, మున్ని,లక్ష్మీదేవి,తదితరులు పాల్గొన్నారు.



మిడుతూరు : వినతి పత్రం ఇస్తున్న ఆశాలు



గడివేముల : వినతి పత్రం ఇస్తున్న ఆశా వర్కర్లు



నందికొట్కూరు టౌన్ మండలంలో..



ప్యాపిలి మండలంలో..



కంబాలపాడు రహదారిలో కేంద్రీయ విద్యాలయ స్కూలు కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ మంజునాథ్

కేంద్రీయ విద్యాలయానికి స్థలం పరిశీలన

ప్రజాశక్తి-డోన్

పట్టణంలోని కంబాలపాడు రహదారిలో కేంద్రీయ విద్యాలయ స్కూలును ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని కేంద్రీయ విద్యాలయ డిప్యూటీ కమిషనర్ మంజునాథ్ శనివారం పరిశీలించారు. మొత్తం 13 ఎకరాల్లో స్కూల్‌ను ఏర్పాటు చేసేందుకు ఆయన స్థలాన్ని పరిశీలించారు. ఒకటి నుంచి పదవ తరగతి వరకు స్కూల్ ను ఏర్పాటు చేసేందుకు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. అంతకుముందు ఆర్ అండ్ బి అతిథి గృహంలో నంద్యాల జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జీలానీ సమూన్ కేంద్ర ఐఏఎస్ అధికారి మంజునాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అదేవిధం గా పట్టణంలో డిప్యూటి కమిషనర్ మంజునాథ్ వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ ఎం శ్రీరాములు,డోన్ ఎంపీ పీ రేగటి రాజశేఖర్ రెడ్డి,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రామచంద్రు డు, ఆర్డీవో వెంకటరెడ్డి,తహసిల్దార్ విద్యాసాగర్,మున్సిపల్ కమిషనర్ వెంకట రామి రెడ్డి, డీఈఓ.సుధాకర్ రెడ్డి,ఎంఈఓ ప్రభాకర్,పాతపేట హై స్కూల్ ఇన్‌ఛార్జ్ హెచ్ఎం ఎం.వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -ఆత్మకూర్

ప్రతి లబ్ధిదారుడికి పథకాలు చేరాలి అని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ముష్టేపల్లి గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ సర్వీస్ చార్జీలు లేకుండానే 11 రకాల ధృవీకరణ పత్రాలను పొందవచ్చునని ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు. మండల స్థానిక నాయకులు, గృహసారథులను కలుపుకొని ప్రతి ఇంటికి వెళ్ళి అర్హత ఉండి లబ్ది పొందని వారిని గుర్తుంచాలన్నారు. అనంతరం మంజూరైన పత్రాలను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. గ్రామ ప్రజలు దగ్గరి నుంచి వచ్చే వినతులను ఎమ్మెల్యే స్వీకరించి పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రెసిడెంట్ రాజమోహన్ రెడ్డి, జెడ్పిటిసి శివశంకర్ రెడ్డి, ఎంపీపీ నల్ల కాలువ తిరుపాలమ్మ, శిద్దపల్లి, ముస్తేపల్లి గ్రామ సర్పంచ్, ఎంపిటీసీ సభ్యులు, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజగోపాల్, సింగల్ విండో చైర్మన్ సురేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్:** ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఈర్నపాడు గ్రామంలో సర్పంచ్ దొర్నిపాటి వెంకట లక్ష్మమ్మ అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ధృవీకరణ పత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. శ్రీశైలం నియోజకవర్గం వైకాపా సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ ముడుమేల పుల్లారెడ్డి, వైకాపా సీనియర్ నాయకులు పిట్టం పెద్ద రామ సుబ్బారెడ్డి, కుమార్ రెడ్డి, ఎర్ర గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. **రేగడగూడూరులో.. వెలుగోడు:** మండలంలోని రేగడగూడూరు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పాల్గొన్నారు. నాయకులు భువనేశ్వర రెడ్డి, దేశం తిరుపం రెడ్డి, మండల అధ్యక్షులు అంబాల ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. గ్రామంలోని జగనన్న కాలనీలోని ఎస్సీ, బీసీ ,కాలనీకి డ్రైనేజీ కాలువలు రోడ్లు లేవని ఆ కాలనీవాసులు ఎమ్మెల్యేను కోరగా తక్షణమే పనులను ప్రారంభించేందుకు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం వెలుగోడు పట్టణ మత్స్య కారులు ఎమ్మెల్యే శిల్పాను కలిసి సమస్యలను చెప్పుకున్నారు. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కారం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. **చాగలమర్రి:** పట్టణంలోని 2వ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 137 మందికి వివిధ రకాల సేవా పత్రాలను మేజర్ సర్పంచి తులసమ్మ, అధికారులు అందజేశారు. ఎంపీడీవో మహబూబ్ దౌలా,డిప్యూటీ తహసిల్దార్ విజయకుమార్, ఎంఈఓ న్యామతుల్లా, ఏవో రంగ నేతాజీ, మండల పశువైద్యాధికారి సాయిబాబా, ఏఈలు జగ్గయ్య, సలీం, కొండారెడ్డి,ఈ ఓ ఆర్ డి సుదర్శన్ రావు, ఐ సి డి ఎస్ సూపర్వైజర్ సుశీల,సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

మిడ్తూరు : మండలంలోని మాస్ పేట గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఓ నాగ శేషాచల రెడ్డి, తహసిల్దార్ ప్రకాష్ బాబు, ఈఓఆర్డి ఫక్రుద్దీన్, జడ్పిటిసి యుగంధర్ రెడ్డి, ఎంపిటిసి కమతం జయమ్మ, సర్పంచి షేక్ షంసున్ బీ లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. **పాములపాడు :** మండలంలోని రుద్రవరం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో గోపికృష్ణ, తాసిల్దార్ రత్న రాధిక పాల్గొని సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో ఆర్ డి శ్రీనివాసులు నాయుడు, ఏవో పనిశ్వర్ రెడ్డి, ఎంఈఓ బాలాజీ నాయక్, ఏపిఎం అనురాధ, ఏపీవో విమలమ్మ,సర్పంచ్ రామస్వామి వైసిపి నాయకు లు జూటూరు మధు, రమణారెడ్డి,కో ఆప్షన్ నెంబర్ ముర్తుజా అలీ, రామ్మోహన్ సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** రాష్ట్రంలో సిఎం జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్న పాలన దేశానికే ఆదర్శమని, జగనన్న సురక్షతో ప్రజల ఇంటి వద్దకే సేవలు అందిస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని కనకాద్రిపల్లె గ్రామ సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం 11 రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ భాస్కర్ నాయుడు, వైసిపి మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి పేరం సత్యనారాయణ రెడ్డి, ఒడల సచివాలయాల కన్వీనర్ మొలక రాజారెడ్డి, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు లాయర్ మహేశ్వర్ రెడ్డి, నందిపాడు సర్పంచి గురువిరెడ్డి, సత్తి గారి రామిరెడ్డి, కనకాద్రిపల్లె మాజీ సర్పంచి కె.దస్తగిరి, మాజీ ఎంపిటిసి చంద్రశేఖర్, తహశీల్దార్ ధోని ఆల్ ఫ్రెండ్, ఎంపిడిఓ ప్రసాద్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు. **రుద్రవరం :** మండలంలోని మందులూరు గ్రామపంచాయతీ సర్పంచ్ నిర్మల దేవి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రజలకు కుల, ఆదాయ, జనన , మరణ తదితర సర్టిఫికెట్లను ఆమె పంపిణీ చేశారు. తహశీల్దార్ రవీందర్ ప్రసాద్, ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, ఉపాధి ఏపీవో ప్రతాప్, వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ, పిఆర్ ఏఈ వెంకటరాముడు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్, మండల ఉపాధ్యక్షుడు వీర శేఖర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఓబులేష్, వీఆర్వో ఫక్రుద్దీన్, వైసిపి నాయకులు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** మండలంలోని ఎస్. లింగందిన్నె గ్రామ సచివాలయములో జగనన్న సురక్ష కార్యక్రమం ఎంపీడీవో మహబూబ్ ఖాన్ అధ్యక్షతన జరిగింది. గ్రామ సచివాలయ సిబ్బంది చేతుల మీదుగా కుల, నివాస, ఆదాయ సర్టిఫికెట్లను అందజేశారు. మండల స్థాయి అధికారులు, వైసిపి నాయకులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **మహానంది :** మహానంది గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పాల్గొని మాట్లాడారు. అనంతరం 11 రకాల ధ్రువపత్రాలు ప్రజలకు అందించారు. ఎంపీపీ బుడ్డా రెడ్డి యశస్విని, సర్పంచ్ చలం చలం శిరీష, జడ్పిటిసి మహేశ్వర్ రెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ మహేశ్వర్ రెడ్డి, మండల నాయకులు ఒంటెద్దు వీరారెడ్డి, భూమా సుబ్బరామయ్య, శరభారెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి



మిడ్తూరు : సర్టిపికెట్లను అందజేస్తున్న దృశ్యం



చాగలమర్రి : సర్టిపికెట్లను అందజేస్తున్న సర్పంచ్,అధికారులు



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



వెలుగోడు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు : డిఎంహెచ్ఒ



గర్భిణీతో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని డిఎంహెచ్ఒ డాక్టర్ వెంకటరమణ పేర్కొన్నారు. శనివారం చాబోలు గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఆర్ వెంకటరమణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు. హెచ్ఎంఐఎస్, సియస్ యస్ యమ్ పోర్టల్ నందు అప్లోడ్ చేయాలని లేనియెడల చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

అపరిచితులతో జాగ్రత్త

ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.నిర్మల

పజాశక్తి - నంద్యాల రూరల్

బాలికలు అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మల తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో శనివారం కస్తూర్బా గాంధీ కళాశాలలో చైల్డ్ రైట్స్ (బాలల హక్కులు, సేఫ్, అన్ సేఫ్ టచ్, పోక్సో యాక్ట్ 2012) అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేఫ్ టచ్, అన్‌సేఫ్ టచ్ గురించి తెలియజేశారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి టి.శారద మాట్లాడారు. వరల్డ్ విజన్ పిఒ తిరుపతిరావు, మదర్ సొసైటీ ఫౌండర్ అండ్ సీఈవో మేడిద రామారావు, కస్తూర్బా గాంధీ కళాశాల ప్రిన్సిపల్ స్వర్ణలత, ఎస్సీ బీసీ జిల్లా కోఆర్డినేటర్ బి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసిడియస్ ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మల

మైనింగ్ అక్రమాలు పట్టని అధికారులు : టిడిపి

ప్రజాశక్తి - పాణ్యం

పాణ్యం మండలంలోని తమ్మరాజుపల్లె గ్రామంలో అక్రమ మైనింగ్ యథేచ్ఛగా జరుగుతున్న అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని టిడిపి పాణ్యం నియోజకవర్గ ఇంఛార్జి గౌరు చరిత రెడ్డి అన్నారు. శనివారం తమ్మరాజుపల్లె గ్రామంలో మైనింగ్ జరుగుతున్న ప్రాంతాన్ని ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ బ్లాస్టింగ్ వల్ల సమీపంలోని ఇల్లు పగుళు ఇస్తున్నాయని, సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో వైసిపి నేతల కనుసన్నల్లో ఈ తతంగం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రమణమూర్తి, లాయర్ బాబు, రాంపుల్లారెడ్డి, రంగ రమేష్, ఇప్ప సుధాకర్, ఖాదర్, సుబ్బయ్య, కుమార్ రెడ్డి, అమరసింహా రెడ్డి, దుబాయ్ శీను, గుజ్జుల సుబ్బయ్య పాల్గొన్నారు.



మైనింగ్ జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న టిడిపి నాయకులు



ఆర్థిక సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థినికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - పగిడ్యాల

అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థిని సిరికి పాఠశాల ఉపాధ్యాయులు శనివారం రూ. 5వేల ఆర్థిక సాయం అందించారు. పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సిరి గతకొంతకాలంగా చర్మవ్యాధితో అనారోగ్యంతో బాధపడుతోంది. ఈమేరకు ఎంఈఓ సుభాన్, ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రావు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఆర్థిక సాయం అందజేశారు.

మహానందీశ్వరుని సన్నిధిలో ప్రముఖులు

ప్రజాశక్తి - మహానంది

మహానంది పుణ్యక్షేత్రంలోని శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లను పది జిల్లాలకు చెందిన ఐఏఎస్ అధికారులు శనివారం దర్శించుకొని పూజలు నిర్వహించుకున్నారు. వీరికి ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, ట్రస్టు బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వర్ రెడ్డి, మహానంది తహసిల్దార్ జనార్ధన్ శెట్టి,ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. పూజల అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి, శేష వస్త్రాలతో సత్కరించి,తీర్థ ప్రసాదాలు అందజేశారు.



స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు

సోలార్‌తో విద్యుత్ బిల్లు తగ్గించుకోండి

కాటసాని ఓబుల్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్

సోలార్‌ను వాడి విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబుల్ రెడ్డి తెలిపారు. బనగానపల్లె పట్టణంలో సోలార్ అప్లెట్ కంపెనీకి చెందిన శ్రీకృష్ణ సోలార్ ఏజెన్సీని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ ఎంత అభివృద్ధి చెందితే ప్రజలకు విద్యుత్ బిల్లులు అంత భారం తగ్గిపోతుందన్నారు. సోలార్ యూనిట్ గురించి కర్నూలు తదితర పట్టణాలకు వెళ్లి తెలుసుకోవాల్సి వచ్చేందని, ఇప్పుడు బనగానపల్లె పట్టణంలో సోలార్ యూనిట్ రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సోలార్‌పై అవగాహన పెంచుకోవాలని, రాబోయే కాలంలో పూర్తిగా విద్యుత్ సోలార్ నుండి వెలుపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ ఐ క్లబ్ అధ్యక్షుడు గాదంశెట్టి వేణుగోపాల్, వ్యాపారవేత్త వెంకటేశ్వర్లు, అప్లెట్ మేనేజింగ్ డైరెక్టర్ మహబూబ్ సుభాన్, బనగానపల్లె యూనిట్ మేనేజర్ ఎస్.మల్లికార్జున్ యాదవ్, మార్కెటింగ్ మేనేజర్ యూనిస్, ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ సాహిత్, రమకాంత్, టెక్నికల్ రవి, మదనగోపాల్, మహేంద్ర, నరసింహులు, చెన్నయ్య, నగేష్, మధు, మనోహర్, మారుతి షాప్ యాజమాని తదితరులు పాల్గొన్నారు.




ప్రారంభిస్తున్న కాటసాని ఓబుల్ రెడ్డి

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు చేరాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - అవుకు

అర్హత కలిగిన ప్రతి గడపకూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని బనగానపల్లి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అన్నవరం సచివాలయ పరిధిలోని చిన్న కొట్టాల, రాఘవ రాజాపురం, నిచ్చెనమెట్ల, అన్నవరం గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. నిచ్చెనమెట్లలో ఎమ్మెల్యే సిసి రోడ్డు, పైపులైన్, డ్రైనేజీని కాలువలను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అన్నవరంలో ఉప సర్పంచి మాదిరెడ్డి సాయినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. నూతన సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం, వాటర్ ప్లాంట్ తదితర వాటిని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కాటసాని ప్రసాద్ రెడ్డి, కాటసాని తిరుపాల్రెడ్డి, మాజీ సర్పంచ్ చెన్నప్ప, ఉమ్మడి కర్నూలు జిల్లా ఎంపిటిసిల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి, అట్ల గోవర్ధన్ రెడ్డి, పార్థసారధి రెడ్డి, మెట్టుపల్లి ఉప సర్పంచి మేకల వెంకటేశ్వర రెడ్డి, వైకె గంగాధర్ రెడ్డి, చర్లోపల్లి చిన్న కంబగిరి స్వామి, తల్లం సుబ్రహ్మణ్యం, మండల అధికారులు పాల్గొన్నారు.



గడపగడపకు ప్రచారంలో ఎమ్మెల్యే